




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 12 సంచిక : 290 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | మంగళవారం 23 జూన్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :290 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | TUE 23 JUNE 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం..

## ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!

- లేబర్ పార్టీ నాయకత్వాన్నీ వీడుతున్నట్లు ప్రకటన
- సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి
- దేశ ప్రయోజనాల కోసమే నిర్ణయమని స్టార్మర్ వ్యాఖ్య
- 100 మందికిపైగా ఎంపీల నుంచి రాజీనామా డిమాండ్
- పదేళ్లలో బ్రిటన్‌కు ఏడో ప్రధాని మార్పు

పెన్ పవర్ డెస్క్:బ్రిటన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ (63) తన పదవికి, అధికార లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సొంత పార్టీ

- మిగతా 2లో

## ప్రపంచంలోనే అతిపెద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ మనదే

### హైదరాబాద్ లో కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్

- క్యాన్సర్‌పై కేంద్ర ప్రభుత్వం సమగ్ర యుద్ధం ప్రకటించిందన్న అనుప్రియ పటేల్
- ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీనింగ్ కార్యక్రమం దేశంలో అమలు
- బసవతారకం ఆస్పత్రి సేవలను కొనియాడిన కేంద్ర మంత్రి
- ఆయుష్మాన్ భారత్ ద్వారా 62 కోట్ల మందికి క్యాన్సర్ చికిత్స భద్రత
- బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందిస్తున్నామన్న మంత్రి




పెన్ పవర్ డెస్క్:క్యాన్సర్ మహమ్మారిపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర యుద్ధం ప్రకటించిందని, ఇందులో భాగంగా ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీనింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. హైదరాబాద్‌లోని బసవతారకం

- మిగతా 2లో

## డబ్బులేక ఏ ఒక్కరూ క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు



పెన్ పవర్ డెస్క్: పేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైందని ఆసుపత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రోజుకి 35 నుంచి 40 శస్త్రచికిత్సలు చేస్తున్నామని.. వేలాది మందికి ఇది ఓ ఆశాకిరణమని చెప్పారు.

- మిగతా 2లో

## లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి.. దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- లక్నో కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం
- ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారణ
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటన
- సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

పెన్ పవర్ డెస్క్:ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో

- మిగతా 2లో



## బసవతారకం ఆసుపత్రి ఆ స్ఫూర్తితోనే పనిచేస్తోంది

- బసవతారకం ఆసుపత్రి సేవలను కొనియాడిన వెంకయ్యనాయుడు
- మారుతున్న జీవనశైలి వల్లే క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని ఆందోళన
- విద్య, వైద్యం ఉచితంగా అందించడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సూచన
- క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రభుత్వాలు తప్పనిసరి చేయాలని విజ్ఞప్తి
- బసవతారకం ఆసుపత్రి సేవలను అమరావతికి విస్తరించాలని కోరిక

- మిగతా 2లో





## హైదరాబాదులో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం..

### హాజరైన సీఎం చంద్రబాబు

- హైదరాబాద్‌లో ఘనంగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ వేడుకలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- డబ్బు లేదనే కారణంతో ఏ రోగికి చికిత్స ఆగకూడదన్నదే లక్ష్యమన్న బాలకృష్ణ
- అమరావతిలోనూ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తున్నామని వెల్లడి
- ఇప్పటివరకు 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించినట్లు వివరణ

పెన్ పవర్ డెస్క్:హైదరాబాదులోని బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ (25వ వార్షికోత్సవ) వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఆసుపత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలకు అండగా నిలవాలనే గొప్ప లక్ష్యంతోనే ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఈ సభలో తాను నటుడిగానో, ఎమ్మెల్యేగానో కాకుండా ఒక కొడుకుగా మాట్లాడుతున్నానని బాలకృష్ణ భావోద్వేగంగా ప్రసంగించారు. తన తల్లి బసవతారకం గారు క్యాన్సర్‌తో బాధపడ్డారని, డబ్బు ఉన్నందున తాము పోరాడగలిగామని గుర్తు చేసుకున్నారు. "డబ్బు లేని పేదలు ఈ మహమ్మారి బారిన పడితే వారి పరిస్థితి ఏంటి?" అని తన తల్లి అడిగిన మాటే ఈ ఆసుపత్రి ఏర్పాటుకు స్ఫూర్తినిచ్చిందని వివరించారు. డబ్బు లేదనే కారణంతో ఏ ఒక్క క్యాన్సర్ రోగికి చికిత్స అందకుండా పోకూడదన్నదే తమ ధ్యేయమని బాలకృష్ణ పునరుద్ఘాటించారు. 25 ఏళ్ల క్రితం చేసిన ఈ ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నామని, భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం

- మిగతా 2లో

## కుట్రలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం.. అప్రమత్తంగా ఉండాలి

### చంద్రబాబుఅధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

- కొన్ని పార్టీలు ప్రతి అంశానికి కుల, మత రంగు పులుముతున్నాయని ఆరోపణ
- ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచన
- ఉద్యోగులు, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశం
- రాష్ట్రంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ప్రతి సంఘటనకు కుల, మత రంగు పులిమి, వివాదాస్పదం చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు దుష్ప్రచారం, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. విద్వేషాలను రెచ్చగొట్టేలా సాగుతున్న తప్పుడు ప్రచారాలను, ఘటనలను అరికట్టేందుకు అధికారులు, ఉద్యోగులు చొరవ చూపాలన్నారు. ఇటీవల జరిగిన కొన్ని నేరాలకు మానసిక సమస్యలు, మరికొన్నింటికి గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం కారణమని ఆయన విశ్లేషించారు. ప్రభుత్వం పాత కేసులను సైతం పరిష్కరిస్తోందని, 2019లో జరిగిన నేరాలను ఇప్పుడు గుర్తించి నిందితులను పట్టుకుని శిక్షలు పడేలా చేస్తున్నామని తెలిపారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరనే వాస్తవాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.

వాహనాల నంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగానే నంబర్ ప్లేట్లు ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సాంకేతికత కీలకమని, ఈ నేపథ్యంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో క్వాంటం కంప్యూటర్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రత, జల భద్రత, భూగర్భ జలాల రీఛార్జ్, నదుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)

- మిగతా 2లో



## 10 సూత్రాల అమలు.. సీఎం చంద్రబాబు సమక్షంలో కీలక ఒప్పందం

- స్వర్ణాంధ్ర 2047 విజన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం
- ప్రణాళికా విభాగంతో కేఆర్ఈఏ వర్సిటీకి చెందిన ఐఎఫ్ఎంఆర్ ఎంఓయూ
- 15 శాతం వృద్ధిరేటు సాధనే లక్ష్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- జీరో పావర్టీ, వాటర్ సెక్యూరిటీ, డీప్ టెక్ మిషన్లపై తొలుత దృష్టి
- పది సూత్రాల అమలుకు రాష్ట్రస్థాయి కమిటీ, వర్కింగ్ గ్రూపుల ఏర్పాటు

- మిగతా 2లో




## స్థానికుల కోరిక మేరకు నచ్చిన దేవుడి మందిరాలు

పెన్ పవర్ డెస్క్:: గత ప్రభుత్వ హయాంలో విచ్ఛిన్నకర వాతావరణం ఉండేదని, దేవాలయాలకు సరైన ఆదరణ ఉండేది కాదని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సచివాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో దేవాదాయశాఖ రెండేళ్ల పనితీరుపై ఆయన రిపోర్టు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలు సమాజంలో భాగమని గత ప్రభుత్వం మరిచిపోయిందన్నారు." దేవాదాయశాఖ అభివృద్ధి, ప్రగతిని మీ ముందుంచుతున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమల నుంచి దేవాదాయ శాఖ ప్రక్షాళన ప్రారంభించింది.

- మిగతా 2లో

## పవన్ కల్యాణ్ మాటలకు నా పీఏ కూడా స్పందించడు

- పవన్ హావభావాలపై సోషల్ మీడియాలో విపరీతంగా మీమ్స్ వస్తున్నాయన్న శ్రవణ్ కుమార్
- సినిమాల్లో కంటే నిజ జీవితంలో అద్భుతంగా నటిస్తున్నారని వ్యాఖ్య
- సుగాలి ప్రీతి కేసులో పవన్ మాట మార్చారని విమర్శ

- మిగతా 2లో



## టెకీ రాధా గాయత్రి కేసులో కీలక పరిణామం.. విచారణాధికారి మార్పు

పెన్ పవర్ డెస్క్: ఉత్తరాఖండ్‌లోని మసూరీలో అనుమానాస్పదరీతిలో మృతి చెందిన టెకీ రాధా గాయత్రి కేసు )లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు విచారణాధికారిని అక్కడి డీజీపీ దీపమ్‌సేథ్ మార్పు చేశారు. మసూరీ ఎస్‌హెచ్‌వో దేవేంద్ర చౌహాన్ ప్రవర్తనపై మృతురాలి తండ్రి సుధాకర్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎస్‌హెచ్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచారణ నుంచి తప్పించారు.

- మిగతా 2లో



# ఎడిటర్ వ్యూ

## పిఠాపురం రాజకీయ కాక !

పిఠాపురం ఎమ్మెల్యే గారి తాలూకా అని 2024 ఎన్నికల ముందూ తరువాత ఏపీ అంతా ఊగేలా స్లోగన్స్ చేసింది జనసైన్యం. పిఠాపురం అలా ఏపీ ఆంతా హాట్ టాపిక్ తొలిసారి అయింది. ఆ క్రెడిట్ కచ్చితంగా పవన్ కళ్యాణ్ దే. ఎందుకంటే ఆయన వెండితెర మీద పవర్ స్టార్. ఆయన ఫాలోయింగ్ అన్నది ఊహాతీతం. ఆయన క్రేజ్ అన్నది అద్భుతం. అందుకే పిఠాపురం అన్న ఒక అసెంబ్లీ నియోజకవర్గం టాక్ ఆఫ్ ది స్టేట్ అయింది. అది పవన్ అక్కడ నుంచి పోటీ చేయాలని ఎంచుకుని నిలిచి గెలిచిన తరువాత జరిగిన డెవలప్మెంట్స్ గానే వీటిని చూడాల్సి ఉంది.

**పొలికేక గా మారింది :**

పిఠాపురం నుంచి పవన్ పోటీ చేసి గెలిచారు. ఆయన ఆ తరువాత ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఇక రెండేళ్ళ కూటమి పాలనలో కాపులకు న్యాయం జరగడం లేదని వైసీపీ కాపులంతా ఒక చోట చేరి మీటింగ్ పెట్టారు. అది కోనసీమ జిల్లా వేదికగా జరిగింది. ఈ మీటింగ్ తరువాత రాజకీయ ప్రకంపనలు ఒక రేంజిలో సాగుతున్నాయి. జనసేన కాపులు వర్సెస్ వైసీపీ కాపులు అన్నట్లుగా రాజకీయం రంజుగా సాగుతోంది. ఈ మీటింగ్ తరువాత వైసీపీ నాయకురాలు వంగా గీత మీడియాతో మాట్లాడుతూ ఒక కామెంట్ చేశారు. పవన్ కులాన్ని తక్కువ చేయకూడదని అన్నారు. కాపులు ఎక్కువగా ఉన్నారనే కదా పిఠాపురం ఎంచుకుని పోటీ చేశారు అని ఆమె కామెంట్స్ చేశారు. అదే ఇపుడు ఏపీలో రాజకీయ పొలికేక గా మారిపోయింది.

**పంతం నానాజీ ఫైర్ :**

మరో వైపు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే జనసేన నేత పంతం నానాజీ అయితే హాట్ కామెంట్స్ చేశారు. పవన్ పిఠాపురం నుంచి పోటీ చేస్తే తప్పేంటి అన్నారు. వంగా గీతది పిఠాపురం అమ్మ గారి ఊరా నాన్న గారి ఊరా అని ప్రశ్నించారు. అసలు ఎవరు ఎక్కడ నుంచి అయినా పోటీ చేయవచ్చు అని రాజ్యాంగంలో ఉందని అన్నారు. జగన్ పులివెందుల నుంచి బయటకు వచ్చి కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పోటీ చేస్తే తమ సత్తా ఏమిటో చూపిస్తామని పంతం నానాజీ రాజకీయ పంతమే పూనారు. ఈ సందర్భంగా ఆయన ఆవేశంలో జగన్ మీద అనుచిత వ్యాఖ్యలే చేశారు.

**భగ్గుమన్న వైసీపీ :**

పంతం నానాజీ వ్యాఖ్యలతో వైసీపీ నేతలు అంతా భగ్గుమంటున్నారు. పంతం నానాజీ మీద 2024 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలు అయిన మాజీ మంత్రి కురసాల కన్నబాబు జగన్ వంటి నేత మీద మాజీ సీఎం మీద పంతం నానాజీ దారుణమైన కామెంట్స్ చేస్తున్నారు అని మండిపడ్డారు. జనసేన తమతో సవాల్ చేసే ముందు ఒంటరిగా పోటీకి దిగాలని ఆయన అన్నారు. పొత్తులతో వచ్చి గెలవడం కాదని ఎద్దేవా చేశారు. పదిహేనేళ్ల పాటు కూటమి పొత్తులో ఉంటామని జనసేన చెప్పడమే జగన్ అంటే భయం ఏంటో తెలియచేస్తోందని మళ్లీ సవాళ్ళు ఎందుకని ఆయన ప్రశ్నించారు.

**నా మరణం పిఠాపురం గడ్డ మీదనే :**

ఇక వంగా గీత అయితే భావోద్వేగంతో కూడిన వ్యాఖ్యలు చేశారు. తన పుట్టింటి వారు అంతా ఉండేది పిఠాపురంలోనే అని చెప్పారు. తనది నాలుగు దశాబ్దాల సుదీర్ఘమైన రాజకీయం అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ గా పనిచేశాను అని అలాగే ఎంపీగా ఎమ్మెల్యేగా నెగ్గిన తనను జగన్ పిలిచి కాకినాడ ఎంపీగా పోటీ చేయించారని గుర్తు చేసుకున్నారు. తన మరణం కూడా పిఠాపురంలోనే అని పిఠాపురంతో తన అనుబంధాన్ని ఎవరూ ప్రశ్నించజాలరని ఆమె ఎమోషనల్ గా కామెంట్స్ చేశారు. మొత్తం మీద చూస్తే పిఠాపురం చుట్టూ రాజకీయ కాక అంటుకుంది. మరి ఇది ఏ మలుపు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

## 10 సూత్రాల అమలు.. సీఎం చంద్రబాబు సమక్షంలో కీలక ఒప్పందం

ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన 'స్వర్ణాంధ్ర 2047 విజన్' అమలులో ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా నిర్దేశించిన పది సూత్రాలను సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రణాళికా విభాగం, కేఆర్ఈఏ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ రీసెర్చ్ (ఐఎఫ్ఎంఆర్) మధ్య సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరిగింది. సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధి కపిల్ విశ్వనాథన్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో 15 శాతం వృద్ధిరేటును సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. 2014-19 మధ్య కాలంలో 13.5 శాతం సగటు వార్షిక వృద్ధి రేటును (సీఏజీఆర్) సాధించామని, అయితే గత ఐదేళ్లలో వివిధ కారణాల వల్ల అది 11 శాతానికి పరిమితమైందని విశ్లేషించారు. ఇప్పుడు నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ), వృద్ధిరేటు సాధనలో పది సూత్రాల మిషన్ సెల్స్‌ను ఏర్పాటు చేసి, వాటి పర్యవేక్షణ బాధ్యతలను ఐఎఫ్ఎంఆర్ చూస్తుంది. తొలిదశలో జీరో పావర్టీ (పేదరిక నిర్మూలన), వాటర్ సెక్యూరిటీ (జల భద్రత), డీప్ టెక్నాలజీ మిషన్లపై ఐఎఫ్ఎంఆర్ ప్రభుత్వంతో కలిసి పనిచేయనుంది. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, విధానపరమైన సూచనలు అందించడంతో పాటు, వినూత్న పద్ధతులను సిఫారసు చేస్తుంది. ఈ పది సూత్రాల అమలును పర్యవేక్షించేందుకు ప్రభుత్వం రాష్ట్రస్థాయి కమిటీతో పాటు, మిషన్ వర్కింగ్ గ్రూపులను కూడా ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలోని అన్ని రంగాల అభివృద్ధికి డీప్ టెక్‌ను అనుసంధానం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఏఐ స్కిల్లింగ్, డ్రోన్ మ్యాపింగ్, ఆటోమొబైల్, మెటల్స్, స్టీల్, సెమీ కండక్టర్స్, రక్షణ రంగాల్లో కీలక ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తున్నాయని గుర్తుచేశారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీలను సైతం రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కేఆర్ఈఏ, ఐఎఫ్ఎంఆర్ ప్రతినిధులు, ప్రణాళికా విభాగం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ మనదే

- మొదటి పేజి తరువాయి

ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రజతోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అనుప్రియ పటేల్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 1.84 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ల (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) ద్వారా 30 ఏళ్లు దాటిన వారికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు 35 కోట్ల మందికి ఓరల్ క్యాన్సర్, 16 కోట్ల మంది మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, 9 కోట్ల మందికి సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పూర్తి చేశామని పేర్కొన్నారు. ముందస్తుగా వ్యాధిని గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చని, చికిత్సా భారాన్ని తగ్గించవచ్చని ఆమె అన్నారు. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన మౌలిక సదుపాయాలను భారీగా పెంచామని, 2014కు ముందు 384గా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్య ఇప్పుడు 820కి చేరిందని తెలిపారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కింద 62 కోట్ల మంది పేదలకు క్యాన్సర్ చికిత్సలో ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. జన్ ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరకే మందులు అందిస్తున్నామని గుర్తుచేశారు. నివారణ చర్యల్లో భాగంగా 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. స్వర్గీయ ఎన్టీ రామారావు దార్శనికతతో, బసవతారకం గారి స్ఫూర్తితో ఏర్పాటైన ఈ ఆసుపత్రి, గత 25 ఏళ్లుగా పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆసుపత్రి చేస్తున్న సేవలను కొనియాడారు. అమరావతిలో కొత్తగా ఏర్పాటు చేయబోయే ఆసుపత్రికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## బసవతారకం ఆసుపత్రి ఆ స్ఫూర్తితోనే పనిచేస్తోంది

బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సేవలు మహోన్నతమైనవని, స్వర్గీయ నందమూరి తారక రామారావు, బసవతారకం గార్ల స్ఫూర్తితో ఏర్పాటైన ఈ సంస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రశంసించారు. అయితే, మారుతున్న జీవనశైలి కారణంగా దేశవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి ఒక 'రాచపుండు'లా విస్తరిస్తోందని, దీనిని ఎదుర్కోవడానికి ఒక జాతీయ మిషన్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఒక కర్తవ్యంగా చేపట్టాలని ఆయన సూచించారు.

బసవతారకం ఆసుపత్రి రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్న వెంకయ్యనాయుడు తన ప్రసంగంలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. స్వర్గీయ ఎన్టీఆర్ తన భార్య బసవతారకం గారి కోరిక, ప్రేరణతో ఈ ఆసుపత్రిని స్థాపించి గొప్ప ఆశయానికి పునాది వేశారని, వారి స్మృతికి నివాళులర్పించారు. ప్రస్తుతం ఆసుపత్రి చైర్మన్‌గా నందమూరి బాలకృష్ణ, ఆయన కుమార్తె బ్రహ్మణి నాయకత్వంలో ఆసుపత్రి మరింత ఉన్నతంగా సేవలందించడం అభినందనీయమని అన్నారు. ఈ సేవలను ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కూడా విస్తరించి, మరింత మందికి అందుబాటులోకి తేవాలని ఆయన ఆకాంక్షించారు.

**జీవనశైలి మార్పులే ప్రధాన కారణం**

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగానే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు పెరుగుతున్నాయని వెంకయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. "మన జీవితంలో, జీవన శైలిలో వస్తున్న మార్పుల కారణంగానే ఈ రాచపుండు విజృంభిస్తోంది. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. క్యాన్సర్ అనే పదం బదులు 'రాచపుండు' అనే స్వచ్ఛమైన తెలుగు పదాన్ని వాడటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అమెరికాలో ఉంటూ కూడా అద్భుతమైన తెలుగు భాషా పరిజ్ఞానంతో మాట్లాడిన మంత్రి చంద్రశేఖర్ గారిని చూసి ఎంతో మురిసిపోయానని అన్నారు.

**వైద్యం ఒక పవిత్రమైన మిషన్**

వైద్యం, విద్య అనేవి వ్యాపారాలుగా కాకుండా ఒక మిషనరీ స్ఫూర్తితో సాగాలని వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. బసవతారకం ఆసుపత్రిలోని వైద్య బృందం డాక్టర్ ప్రభాకర్ రావు, డాక్టర్ సోమసుందర్ రావు, డాక్టర్ కృష్ణయ్య వంటి వారు రోగులకు ప్రేమపూర్వకంగా, అంకితభావంతో సేవలు అందిస్తున్నారని, అందుకే ఆ ఆసుపత్రి విజయవంతంగా నడుస్తోందని కొనియాడారు. తాను కూడా అప్పుడప్పుడు తెలిసిన రోగుల కోసం ఆసుపత్రికి వెళ్తుంటానని గుర్తు చేసుకున్నారు.

**ఉచితాలపై కీలక వ్యాఖ్యలు.. ప్రభుత్వాలకు సూచనలు**

ప్రభుత్వాలు విచక్షణారహితంగా ఉచితాలు పంచడం తగదని, అవి అరుచితాలుగా మారతాయని వెంకయ్యనాయుడు పునరుద్ఘాటించారు. "నేను ఎప్పుడూ చెబుతుంటాను, ఉచితాలు వద్దయ్యా అవి అరుచితాలు అయిపోతాయి. కానీ విద్య, వైద్యం ఈ రెండింటినీ ఉచితంగా ఇవ్వండి. సామాన్య ప్రజలు ఎంతో లాభపడతారు" అని ఆయన స్పష్టం చేశారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వాలు ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అత్యాధునిక పరిజ్ఞానంతో వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు.

## హైదరాబాదులో బసవవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం..

- మొదటి పేజి తరువాయి

ఆసుపత్రిలో రోజుకు 35 నుంచి 40 సర్జరీలు జరుగుతున్నాయని, ఇప్పటివరకు 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించామని తెలిపారు. దేశంలోనే తొలి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాల్లో తమది ఒకటని గర్వంగా చెప్పారు.

భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోనూ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించనున్నట్లు బాలకృష్ణ ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రి సేవలను కూడా మరింత విస్తరిస్తామని వెల్లడించారు. ఈ వేడుకలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనరసింహ, ఏపీ మంత్రి సత్యకుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## కుట్రలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం.. అప్రమత్తంగా ఉండాలి

- మొదటి పేజి తరువాయి

కింద వచ్చే అర్జీలను సానుభూతితో పరిశీలించాలన్నారు. "సమస్య పరిష్కారం కోసం తమ దగ్గరకు వచ్చే పౌరులతో అధికారులు, ఉద్యోగులు మర్యాదగా ప్రవర్తించాలి. వారి స్థానంలో మనమే ఉంటే ఎలా ఆలోచిస్తామో అలా ఆలోచించి సేవలు అందించాలి. ఇది పరిపాలనపై ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని పెంచుతుంది" అని ఆయన హితవు పలికారు.

ఉద్యోగుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తామని, పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని తేల్చిచెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారానే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమవుతుందని, మంత్రులు, అధికారులు, ఉద్యోగులు దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఫైళ్ల క్లియరెన్స్ సులభమైందని, అయితే వినూత్న ఆలోచనలు లేకపోతే వ్యవస్థలు నిస్సారంగా మారతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డబ్బులేక ఏ ఒక్కరూ క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు

- మొదటి పేజి తరువాయి

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి సత్యకుమార్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. "నటుడిగా, ఎమ్మెల్యేగా కాదు.. ఓ కొడుకుగా మీ ముందు నిలుచున్నా. మా అమ్మ బసవతారకం క్యాన్సర్ బారిన పడినప్పుడు ఎంతో బాధపడ్డాం. డబ్బు ఉంది కాబట్టి గట్టిగా పోరాడగలిగాం. డబ్బు లేని వారు ఈ వ్యాధితో ఎలా పోరాడుతారని మా అమ్మ ప్రశ్నించారు. అప్పుడే ఈ ట్రస్ట్ ఏర్పాటు ఆలోచన వచ్చింది. 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించాం. బాధతో ఆసుపత్రికి వచ్చే వారు నవ్వుతూ తిరిగి వెళ్లాలి అనేదే మా ఉద్దేశం. భారత్‌లోనే మొట్టమొదటి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రం అప్పట్లో ప్రారంభించాం.

ప్రభుత్వాలు మాకు ఎంతగానో సహకరించాయి. ఎన్నో సంస్థలు, ఎందరో దాతలు ఈ ప్రయాణంలో మాకు అండగా నిలిచారు. ఏ ఒక్క రోగి కూడా డబ్బు లేక క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు. 25 ఏళ్ల క్రితం చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నాం.. భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తాం. హైదరాబాద్‌లో సేవలు మరింత విస్తరిస్తాం" అని బాలకృష్ణ అన్నారు.

## టెకీ రాధా గాయత్రి కేసులో కీలక పరిణామం.. విచారణాధికారి మార్పు

- మొదటి పేజి తరువాయి

అనంతరం ఆ బాధ్యతను సంపూర్ణానంద్ గైరోలాకు అప్పగించారు. అల్లుడు శ్రీచరణ్‌పై అనుమానాలతో సుధాకర్ మసూరీ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో శ్రీచరణ్‌పై హత్య కేసు నమోదైంది.

## లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి.. దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

ఉన్న ఓ మూడు అంతస్తుల భవనంలోని కోచింగ్ సెంటర్‌లో చెలరేగిన మంటల కారణంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, పురానియాలోని ఓ వాణిజ్య భవనంలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే దట్టమైన పొగ భవనం మొత్తాన్ని చుట్టుముట్టడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనం పై అంతస్తుల నుంచి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారంతా 20 నుంచి 24 ఏళ్లలోపు వయసు వారేనని అధికారులు తెలిపారు. ఈ ప్రమాద వార్త తెలియగానే ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు, అలీగఢ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుని లక్నోకు తిరిగి వచ్చారు.

ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. భవనం గోడలను పగలగొట్టి లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## పవన్ కల్యాణ్ మాటలకు నా పీఏ కూడా స్పందించడు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ... పవన్ కల్యాణ్ హావభావాలు, ఆయన మాట్లాడుతున్న విధానంపై సోషల్ మీడియాలో విపరీతంగా మీమ్స్, ట్రోల్స్ వస్తున్నాయని ఎద్దేవా చేశారు. "ఈ శతాబ్దపు మోస్ట్ కామిక్ పర్సన్ పవన్ కల్యాణ్. ఆయన సినిమాల్లో కంటే నిజ జీవితంలోనే అత్యంత అద్భుతంగా నటిస్తున్నారు. పదిమందిలో మాట్లాడుతున్నామనే కనీస బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. ఆయన ఉప ముఖ్యమంత్రి కాకుండా ఉంటే, ప్రెస్ మీట్లో ఆయన మాటలకు నా పీఏ కూడా స్పందించడు. అసలు ఆయన వెంట ఒక సామాజిక వర్గం కళ్లు మూసుకుని ఎలా నడుస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత రాజకీయాలను ప్రస్తావిస్తూ... 2019 వరకు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, మరి దానిపై పవన్ కల్యాణ్ ఎందుకు నోరు మెదపరని శ్రవణ్ కుమార్ నిలదీశారు. ముఖ్యంగా సంచలనం రేపిన 'సుగాలి ప్రీతి' కేసును పవన్ డీల్ చేస్తున్న తీరుపై ఆయన లీగల్ పాయింట్స్ లేవనెత్తారు. "సుగాలి ప్రీతి అసలు ఏ సంవత్సరంలో చనిపోయిందో కూడా కనీస అవగాహన లేకుండా పవన్ మాట్లాడుతున్నారు. గతంలో ఈ కేసు విషయంలో 'భౌభౌ'మని అరిచిన పవన్.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మారుస్తున్నారు" అని మండిపడ్డారు. సుగాలి ప్రీతి కేసులో పోలీసులు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో అన్ని రకాల పక్కా ఆధారాలు ఉన్నాయని, కానీ పవన్ కల్యాణ్ మాత్రం ఆధారాలు లేవని అనడం వెనుక అసలు ఉద్దేశం ఏంటని శ్రవణ్ కుమార్ ప్రశ్నించారు. "కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలన్నీ కోర్టులో అత్యంత భద్రంగా ఉన్నాయి. అలాంటప్పుడు ఆధారాలు లేవంటూ నిందితులను కేసు నుంచి తప్పించాలని పవన్ చూస్తున్నారా?" అంటూ సూటిగా ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ అజ్ఞానాన్ని చూసి జనసేన నేతలు, కార్యకర్తలు తరించాలంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం.. ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!

- మొదటి పేజి తరువాయి

నుంచే పెరిగిన ఒత్తిడి, నాయకత్వంపై అసంతృప్తి నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని చెప్పారు. "నేను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం తీసుకున్నాను" అని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పలు రంగాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. ఆర్థిక వృద్ధి, వేతనాల పెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల, కార్మికులు-అద్దెదారుల హక్కుల బలోపేతం వంటి అంశాలను ప్రస్తావించారు. రక్షణ వ్యయాన్ని పెంచడం, అక్రమ వలసలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం, చిన్నారుల పేదరికం తగ్గించే కార్యక్రమాలు అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రధాన విజయాలని పేర్కొన్నారు. అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. తరచూ నాయకత్వ మార్పులు చోటుచేసుకోవడం దేశ రాజకీయాల్లో నెలకొన్న అస్థిరతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా సేవలపై ఒత్తిడి, ఆర్థిక సవాళ్లు, అక్రమ వలసల వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు బ్రిటన్‌లో పెరుగుతున్నాయి.

## స్థానికుల కోరిక మేరకు నచ్చిన దేవుడి మందిరాలు

- మొదటి పేజి తరువాయి

పవిత్ర స్థలాలు సామన్యులకు అందుబాటులో ఉంచే చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రతి ఇంటికీ ఆధ్యాత్మికత చేర్చాలన్న సీఎం ఆదేశాలతో పని చేస్తున్నాం. రెండేళ్లుగా హిందువుల ఆత్మవిశ్వాసం, ఆధ్యాత్మిక విలువలు కాపాడుతున్నాం. ఆరు వేలకు పైగా ఆలయాల పునర్నిర్మాణానికి రూ.813 కోట్లు వెచ్చించాం. ధార్మిక పరిషత్ ద్వారా శ్రీవాణి నిధులతో 1200కు పైగా భజన మందిరాలు నిర్మించాం. స్థానిక ప్రజల కోరిక మేరకు నచ్చిన దేవుడి మందిరాలు నిర్మిస్తాం. దేవాదాయ భూ రికార్డులను డిజిటలైజ్ చేసి పరిరక్షణ బాధ్యతలు చేపట్టాం. రానున్న రోజుల్లో 65 ఆలయాల్లో అన్నప్రసాదానికి చర్యలు తీసుకుంటున్నాం. అన్నప్రసాదం కోసం ఏటా దేవాదాయశాఖ రూ.84 కోట్లు ఖర్చు చేస్తోంది." అని మంత్రి ఆనం వివరించారు.

# జులై 2న మండల సర్వసభ్య సమావేశం

**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూన్ 22:** మండల సర్వసభ్య సమావేశాన్ని జులై 2న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీహెచ్‌వీ రమణబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.



పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## ఐదేళ్ల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి




- 28 న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూన్ 22:** జిల్లాలో ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. ఐదేళ్లలోపు ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు వేయించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లపై సోమవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 28న బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేయాలని, అనంతరం జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సందర్శనల ద్వారా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని అధికారులను ఆదేశించారు.


జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు గల 1,89,712 మంది చిన్నారులను లక్ష్యంగా నిర్ధారించినట్లు తెలిపారు. కార్యక్రమం నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 1,062 పోలియో బూత్‌లు, 62 ట్రాన్సిట్ బూత్‌లు, 94 మొబైల్ బూత్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇంటింటి సర్వే కోసం 2,004 ప్రత్యేక బృందాలు, 4,518 మంది వ్యాక్సినేటర్లు, 120 మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ సమావేశాలు నిర్వహించి, విద్యాశాఖ సిబ్బంది సహకారంతో 0-5 ఏళ్ల పిల్లలను గుర్తించి బూత్‌లకు వచ్చేలా చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈఓను ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు బూత్‌ల నిర్వహణతో పాటు గృహ సందర్శన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా చూడాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు.

కార్యక్రమం నిరంతరాయంగా జరిగేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, పాఠశాలలను పోలియో బూత్‌ల ఏర్పాటుకు అందుబాటులో ఉంచడంతో పాటు ఉపాధ్యాయులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన 2,09,653 బీవోపీవీ డోసులు అందుబాటులో ఉంచడంతో పాటు 49 కోల్డ్ చైన్ యూనిట్ల ద్వారా వ్యాక్సిన్ నిల్వ, సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వివిధ మాధ్యమాల ద్వారా ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా ప్రజా సంబంధాల అధికారిని ఆదేశించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా గోడలపై వ్రాతలు, చాటింపులు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేసి ప్రయాణంలో ఉన్న చిన్నారులకు కూడా పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ఆయా ఇంటర్వ్యూకు సమాచారం ఇవ్వలేదంటూ ఆరోపణ

ఐసీడీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, జూన్ 22:** మండలంలోని గూడెంకొత్తవీధి ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలో ఇటీవల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైన ఆయా కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఇంటర్వ్యూకు సంబంధించిన సమాచారం అందించకపోవడంతో హాజరు కాలేకపోయానని దేరాల గ్రామానికి చెందిన లోచలి సంధ్యారాణి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. తాను ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకున్నానని, అవసరమైన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఇంటర్వ్యూకు సంబంధించిన సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇంటర్వ్యూకు హాజరు కాలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు జోగిరాజు మాట్లాడుతూ, తన భార్యకే ఇంటర్వ్యూ సమాచారం అందకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధితురాలికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై ఐసిడిఎస్ సూపర్వైజర్ వివరణ కోరగా కాల్ లెటర్ ఇచ్చే ముందు రోజే ఆవిడ సిజిరియన్ కు వెళ్లారని తెలిపారు.



# ఏపీఎస్‌ఆర్టీసీని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించే కుట్రలు






- విద్యా,వైద్యం,ప్రజా రవాణా వంటి కీలక రంగాలు ప్రభుత్వ ఆధీనంలో కొనసాగాలి
- కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన వైయస్సార్సీపి జోనల్ వైయస్సార్ ట్రేడ్ యూనియన్

**,పెన్ పవర్, జూన్ 22**ఏపీఎస్ఆర్టీసీ ప్రవేట్కరించే కుట్రలను ఖండిస్తూ కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన వైఎస్ఆర్సిపి ఛానల్ వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు.వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్టీసీ అధ్యక్షులు గౌతమ్ రెడ్డి,విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు ఆదేశాల మేరకు ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటీకరించే కుట్రలను ఖండిస్తూ..జోనల్ వై.యస్.ఆర్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు పి.వి. సురేష్ జిల్లా వై.యస్.ఆర్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు రాయిపురెడ్డి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి.ఆలోచన ప్రకారం విద్య,వైద్యం,ప్రజా రవాణా వంటి కీలక రంగాలు ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు బలోపేతం కావడం ద్వారా పేద మరియు మధ్యతరగతి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డి తన 3,648 కిలోమీటర్ల పాదయాత్ర సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు,2020 జనవరి 1వ తేదీన ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏపీఎస్ఆర్టీసీని క్రమంగా ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగా 750 ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ సంస్థ పినాకిల్ కి అప్పగించడం, రాష్ట్రంలోని 12 ఆర్టీసీ డిపోలను ప్రైవేట్ సంస్థలకు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. విజయవాడ విద్యాధరపురం డిపో, గుంటూరు-1 డిపోలను ఇప్పటికే ఖాళీ చేయించి ప్రైవేట్ సంస్థలకు అప్పగించే చర్యలు ప్రారంభించారని విమర్శించారు. ప్రభుత్వం ఆర్టీసీ సంస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశం ఉంటే, సంస్థ అభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించి, సంస్థను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దాలని సూచించారు. కానీ ప్రజా రవాణా వ్యవస్థను ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి అప్పగించడం వల్ల భవిష్యత్తులో ప్రయాణికులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆస్తిగా ఉన్న ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

ఈ సమావేశం లో సమన్వయ కర్త తిప్పల శ్రీనివాస్ రెడ్డి , మొల్లి అప్పరావు , నియోజకవర్గం పరిశీలకు జహీర్ అహ్మద్ ,జిల్లా పార్టీ కార్యాలయం పర్యవేక్షకులో రవి రెడ్డి,పార్టీ నాయుకులు జాన్ వెస్లీ,పేర్ల విజయ చంద్ర , సునీల్ .బోని శివ రామ్ కృష్ణ , గోడబా మనోజు , ఎండి షరీఫ్ , ఏడుకొండల రావు , షేక్ ఖాన్, బిపిఎన్ కుమార్ జైన్ (బుజ్జి),నూక రాజు , తదితరాలు పాల్గొన్నారు .

# కాలం చెల్లిన వస్తువుల విక్రయంపై కఠిన చర్యలు

జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ హెచ్చరిక

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,జూన్ 22 :** గడువు ముగిసిన ఆహార పదార్థాలు, తినుబండారాలు, ఇతర వస్తువులను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ హెచ్చరించారు. పాడేరు మండలం లోచలిపుట్టు గ్రామంలోని శ్రీ మోదమాంబ పాఠశాల సమీపంలో ఉన్న శ్రీ దుర్గ మోదమాంబ కిరాణా దుకాణంలో గడువు ముగిసిన, నకిలీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్నట్లు తల్లిదండ్రులు, స్థానికులు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయడంతో జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా కాలం చెల్లిన బింగో చిప్స్, చాక్లెట్లు, బిస్కెట్లు తదితర పిల్లలకు ఇష్టమైన చిరుతిళ్లతో పాటు పలు రకాల ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలను గుర్తించారు. పాఠశాలకు ఆనుకుని దుకాణం ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది చిన్నారులు ఈ వస్తువులను కొనుగోలు చేసే అవకాశం ఉందని, నకిలీ లేదా గడువు ముగిసిన ఆహార పదార్థాల వినియోగం వల్ల పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ఆహార పదార్థాల వల్ల ఫుడ్ పాయిజనింగ్‌తో పాటు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. దుకాణంలో విక్రయిస్తున్న వస్తువులపై సమగ్రంగా పరిశీలన చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన దుకాణ యజమానిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ, పంచాయతీ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు."ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని" జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# స్టీల్ ప్లాంట్ ప్రమాదాలపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ జరిపించాలి

కలెక్టరేట్ వద్ద ప్రజా సంఘాల ధర్నా

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూన్ 22:**స్టీల్ ప్లాంట్ వరుస ప్రమాదాలపై జ్యూడిషియల్ ఎంక్వయిరీ జరిపించాలని, అత్యా నేరం కింద కేసులు నమోదు చేయాలని, మరణించిన వారికి రూ. కోటి, క్షతగాత్రులకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ,ఐఎఫ్ టియు, పి ఓ డబ్ల్యు, ఎం.ఎన్.ఎస్ ఎస్,అరుణోదయ విశాఖ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నా నుద్దేశించి ఐఎఫ్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం,ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాల కారణంగా విశాఖ ఉక్కులో జరిగిన ప్రమాద మరణాలపై జ్యుడీషియల్ ఎంక్వయిరీని ఉన్నత స్థాయి నిపుణులైన అధికారులతో కలిపి సంయుక్తంగా జరిపించాలని,
ప్రమాద కారణమైన వారిపై బిఎన్ఎస్ 105, 308,287,120బి నేరాల కింద కేసులు నమోదు చేయాలని మరణించిన వారికి కోటి రూపాయలు పరిహారం హ,క్షతగాత్రులకు 50 లక్షలు పరిహారం,బాధిత కుటుంబాల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భద్రతా ప్రమాణాలను దెబ్బతీసిన 4:లేబర్ కోడ్లను రద్దు చేయాలని,భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టే విధంగా పాత కార్మిక చట్టాలను సవరించాలని,సదరు ప్రమాదాలకు యాజమాన్యాలను సంబంధిత ప్రభుత్వ అధికారులను బాధ్యులుగా ఆ చట్టంలో పేర్కొనాలని కోరారు. విశాఖ జిల్లా పరిధిలోని స్టీల్ ప్లాంట్లో ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయన్నారు. ఈ నెల 8 న జరిగిన ప్రమాదంలో పదిమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ ప్రమాదానికి ముందు సంవత్సర కాలంలో మరో 20 మంది కార్మికులు కూడా ప్రాణాలు కోల్పోయారన్నారు. కానీ ఈ మరణాల పైన చట్టబద్ధమైన చర్యలు ఏమి తీసుకోవడం లేదని, కేవలం నామమాత్రపు పరిహారం చెల్లించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు.
కాబట్టి పైన పేర్కొన్న అంశాల పైన విచారణ చేపట్టడానికి హైకోర్టు సిట్టింగ్ జడ్జి, నిపుణులైనటువంటి అధికారులతో కూడిన సంయుక్త కమిటీతో ఎంక్వయిరీ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఎస్. వెంకటలక్ష్మి, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నగర కన్వీనర్ ఈసర లక్ష్మి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షులు డి. ఏడుకొండలు,ఐఎఫ్ టియు,పిఓడబ్ల్యూ, ఎం ఎన్ఎస్ఎస్, అరుణోదయ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు



# ఘనంగా మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం జన్మదిన వేడుకలు

- ముఖ్య అతిథిగా రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు.



**కూర్మన్నపాలెం : పెన్ పవర్,జూన్22** పారిశ్రామిక ప్రాంతం గాజువాక నియోజకవర్గం 87వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు ,గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు .పార్టీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ అహర్నిశలు ప్రజల కోసం ఆలోచిస్తూ వార్డ్ అభివృద్దే తన ధ్యేయంగా సుమారు 40 కోట్ల రూపాయలు జీవిఎంసి నిధులు మంజూరు చేయించి వార్డ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని అందులో భాగంగా 83 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఎన్నో పదవులు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, మొల్లు ముత్యాలు, ఇల్లపు ప్రసాదు , 87వ వార్డు అధ్యక్షుడు విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్, రాజన్ రాజ్ , క్రీ కన్నారావు, డీవీ అప్పారావు, ప్రగడ దానయ్య, రమణమూర్తి, కె. శ్రీనివాస్ నాయుడు, దానయ్య ద్రోణాద్రి అప్పలనాయుడు, ఆనంద్ కుమార్, వై.భాస్కరరావు పోతుల కృష్ణ, మల్లా రాము, కనక సత్యం, ఆదినారాయణ, జాన్ రమేష్, కళ్యాణ్ చక్రవర్తి, వై నాగేశ్వరరావు సిద్ధార్థ నగర్ అసోసియేషన్ సభ్యులు, తిరుమల నగర్ అసోసియేషన్ సభ్యులు, గణేష్ నగర్ అసోసియేషన్ సభ్యులు, నియోజకవర్గం సభ్యులు, వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పుష్పశ్రీవాణికు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన తేడాబారికి సురేష్

- 200 మొక్కలు నాటి 300 మందికి అన్నదానం
- పుష్పశ్రీవాణి జన్మదిన వేడుకలు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించిన తేడబారికి సురేష్ కుమార్




**హుకుంపేట పెన్ పవర్ జూన్ 22:**అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రం లో మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ -- టీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ తేడబారికి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో హుకుంపేటలో ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

హుకుంపేట జాతీయ రహదారి 516 పక్కన సుమారు 200 మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు అనంతరం హుకుంపేట హైవే వద్ద సుమారు 300 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించి మానవత్వాన్ని చాటారు. ఈ సందర్భంగా తేడబారికి సురేష్ కుమార్ మాట్లాడుతూ సమాజ సేవ పర్యావరణ పరిరక్షణ నిరుపేదల సంక్షేమం అనే మూడు లక్ష్యాలతో సేవా సంస్థ నిరంతరం పనిచేస్తోంది. అని అన్నారు పుష్పశ్రీవాణి జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం ఆనందంగా ఉందిఅని ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎస్టీ కమిషన్ మెంబెర్ లిల్లీ సురేష్ ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు మరియు జీ మాడుగుల మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకట గంగా రాజు ,అరకు దురియా ఆనంద్ ఎంపీటీసీ, వీ.బీ ప్రేమ్ కుమార్ కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్
- అధ్యక్షకార్యదర్శులు మొశియా తిరుపతిరావు, వెంగడ నీలకంఠం.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 22.:**ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ప్రతి శనివారం జరిగే వారాంతపు సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మొశియా తిరుపతిరావు, వెంగడ నీలకంఠం ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో వినతి పత్రాన్ని సమర్పించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు సోమవారం మాట్లాడుతూ.. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో జరిగే వారపు సంతలో ఏజెన్సీ పరిధిలోని ఆంధ్ర, ఒడిస్సా గ్రామాల నుండి వేలాది మంది గిరిజనులు, రైతులు, వ్యాపారులు వస్తున్నారన్నారు. ఇది వారి జీవనాధారం, వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకునే ఏకైక వేదిక అని, కానీ దురదృష్టవశాత్తు వేల మంది వచ్చే ఈ సంతలో కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. సంత మొత్తానికి మంచినీటి సౌకర్యం లేదన్నారు. ఎండలో గిరిజనులు, చిన్నారులు దాహంతో అల్లాడుతున్నారన్నారు. అదేవిదంగా సంతలో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు, పురుషులు, దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేసేది లేక చెట్ల చాటు, పొదల వెనుకకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అదే విధంగా సంతలో విశ్రాంతి షెడ్లు లేక ఎండ, వర్షం వల్ల రైతులు తెచ్చిన కాయగూరలు పాడవుతున్నాయనీ విశ్రాంతి షెడ్లు నిర్మించాలన్నారు. బస్ స్టాప్ సంత వద్ద బస్సు ఆగే స్టాప్ లేక వృద్ధులు, మహిళలు రోడ్డు మీదే నిలబడాల్సి వస్తుందన్నారు. సంతలో మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విశ్రాంతి షెడ్లు, బస్ స్టాప్ నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతమన్నారు.

# పాఠశాలలో సీట్లు పెంచాలని నిరసన

- విద్యార్థులను పలు పాఠశాలలో చేర్పించిన ఏటిడబ్ల్యు స్వర్ణలత.
- సీట్లు కొరత దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలు నూతనంగా మంజూరు చెయ్యాలి.
- గిరిజన సంఘం నాయకులు కొర్ర త్రినాథ్, ఎం ఎం శ్రీను.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 22.**అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో 6వ తరగతిలో సీట్లు పెంచాలనీ మండల కేంద్రంలో జరిగిన పిజిఆర్ఎస్ లో నిరసన వ్యక్తం చేసినట్లు గిరిజన సంఘం నాయకులు కొర్ర త్రినాథ్, ఎంఎం శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాల విద్య పూర్తి చేసి ఆరవ తరగతిలో జాయినింగ్ నిమిత్తం మండలంలో ఉన్న అన్ని పాఠశాలలో తిరిగిన ప్రభుత్వం ఆదేశం ప్రకారం సీట్లు భర్తీ అయిందని, అదనంగా జాయినింగ్ చేయుటకు అవకాశం లేదని తిరస్కరించారన్నారు. తిరిగి, తిరిగి అలిసిపోయి గిరిజన సంఘంనీ సంప్రదిస్తే విద్యార్థులు, విద్యార్థుల తల్లి తండ్రులతో నిరసన చేపట్టామన్నారు. దీనిపై మండల అభివృద్ధి అధికారి కె.ధర్మారావు సమక్షంలో ఎటిడబ్ల్యు స్వర్ణలత వివిధ పాఠశాలల హెచ్ఎం లకు వచ్చిన ప్రతి విద్యార్థికి అడ్మిషన్ ఇవ్వాలని దరఖాస్తుల్లో సంతకం చేసి పంపించి జాయినింగ్ చేయించారు. విద్యార్థులను జాయినింగ్ చేయుటకు కృషి చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతున్నందున బాలిక, బాలురలకు నూతన పాఠశాలలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మహిళ సంఘం కార్యదర్శి ఎస్.ఈశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు సుందర్, భవాని శంకర్, శుక్రన తదితరులు పాల్గొన్నారు.

# సార్. స్పెషల్ ఇంటెన్సివ్.రివషన్ పై అవగాహనా కార్యక్రమం.



**హుకుంపేట పెన్ పవర్ జూన్ 22:**హుకుంపేట మండలం హుకుంపేట పంచాయతీ హుకుంపేట గ్రామం లో నేడు ప్రజలకు సార్ - స్పెషల్ ఇంటెన్సవ్ రెవిషన్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు ఓటర్ జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, దిద్దుబాట్లకు సంబంధించిన విధివిధానాలను వివరించడం జరిగింది.ప్రతి అర్హులైన పౌరుడు తమ పేరు ఓటర్ జాబితాలో సరిగ్గా నమోదై ఉండేలా చూసుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత అని, సార్ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా కోరడం జరిగింది. ఎటువంటి సందేహాలు ఉన్నా స్థానిక బూత్ లెవల్ అధికారులను మరియు బూత్ ఏజెంట్స్ లకు కుడా సంప్రదించవచ్చని తెలిజెయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో హుకుంపేట పంచాయతీ మాజీ సర్పంచ్ సమిడ. వెంకట పూర్ణిమ, వి ఆర్ ఓ ,బి ఎల్ ఓ రత్న కుమారి, బి ఎల్ ఏ బద్నాయిని శివ బాలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింట సర్వేలో ఏఎంసీ చైర్మన్ “మచ్చలి మంగతల్లి”

- ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన




**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 22 :** కొండ గోకిరి పంచాయతీ కొత్త పాడి, పాత పాడి గ్రామాల్లో పాడేరు ఏఎంసీ చైర్మన్ బిజెపి పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చల మంగ తల్లి ఇంటింటా సర్వేలో బి ఎల్ వో లు ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రజలు వివరాలు సేకరణ వాటర్ జాబితా పరిశీలన చేపట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఇంటింటా చేపట్టిన చదివే కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించిందని ఆమె అభిప్రాయపడ్డారు ఈ కార్యక్రమంలో బిఎల్వోలు ఇతర అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి...!


- మారుమూల జెర్రీ గొంది లో ప్రత్యేక వైద్య శిబిరం
- 62 మందికి వైద్య సేవలు
- యు. చీడిపాలెం పిహెచ్సి షవైద్యాధికారి హేమంత్ చౌదరి



**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 22:**వాతావరణం మార్పులతో ప్రస్తుత పరిస్థితిలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని యూ.చీడిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హేమంత్ చౌదరి కోరారు. సోమవారం జెర్రీ గొంది మారుమూల గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య సభలో సమీప గ్రామాల నుండి 62 మంది తరలివచ్చి వైద్య సేవలు పొందినట్లు డాక్టర్ హేమంత్ చౌదరి అన్నారు. అవసరమైన వారికి మందులు అందజేయడం జరిగింది అన్నారు. ప్రస్తుత సీజన్లో సీజన్ వ్యాధులు ప్రబలకుండా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు అలాగే ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే సేవించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఓ గంగరాజు, హెచ్ వి విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ శివ, ల్యాబ్ టెక్నీషియన్ ఆనంద్ ,ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు


# నకిలీ ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు పేసా కమిటీ సభ్యులు,గిరిజన నాయకుల వినతి




**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, జూన్ 22 :** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలో నకిలీ ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలను ఉపయోగిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు పొందుతున్న వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని పేసా గ్రామసభ నాయకులు, గిరిజన నాయకులు డిమాండ్ చేశారు.ఆల్ ఇండియా ఆదివాసి స్వయంపాలన సాధనా సమితి ఉపాధ్యక్షుడు మడపల సోమేశ్ కుమార్ ఆధ్వర్యంలో పేసా మండల అధ్యక్షుడు కొర్ర బలరాం, ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు తదితరులు సోమవారం గూడెంకొత్తవీధి తహసీల్దార్ హెచ్. అన్నాజీరావుకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పలువురు గిరిజనేతరులు నకిలీ ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలను ఉపయోగించి ప్రభుత్వ ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు పొందడమే కాకుండా, 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తూ గిరిజన భూములను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల నిజమైన గిరిజనులకు ఉద్యోగ, విద్యా అవకాశాలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గత కొన్నేళ్లుగా జిల్లాలో నకిలీ ఎస్టీ సర్టిఫికెట్ల వినియోగం పెరిగిందని, కొందరు గిరిజన రిజర్వేషన్ పేరిట ప్రజాప్రతినిధి పదవులు కూడా అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా గిరిజనేతరులు ప్రభుత్వ భూములు, అటవీ భూములను ఆక్రమిస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.మండలంలోని ప్రతి పంచాయతీలో పేసా గ్రామసభలు నిర్వహించి, అనుమానిత నకిలీ ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలపై సమగ్ర విచారణ చేపట్టాలని, నకిలీగా తేలిన వారి కుల ధృవీకరణ పత్రాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నకిలీ సర్టిఫికెట్లతో పొందిన ఉద్యోగాలను రద్దు చేసి, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.సుప్రీంకోర్టు తీర్పులు, ప్రభుత్వ ఉత్తర్వులు, భారతీయ న్యాయసంహిత నిబంధనల ప్రకారం నకిలీ కుల ధృవీకరణ పత్రాలపై కఠిన చర్యలు తీసుకుని గిరిజనులకు న్యాయం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పేసా మండల ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు, కోశాధికారి లకే రామచంద్రుడు, పేసా గ్రామసభ సభ్యులు కే. రవి, వి. జగన్నాథరావు, యువకులు సాగిన లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ విమల విద్యాలయం సమస్య పరిష్కారానికి కలెక్టర్ కు వినతి



**గాజువాక పెన్ పవర్, జూన్ 22:**ఉక్కు నిర్వాసితు కాలనీలో ఉన్న నిర్వాసిత ప్రజలు, కాంట్రాక్ట్ కార్మికుల పిల్లల ఉచిత విద్యకు విశాఖ విమల విద్యాలయం - పెదగంట్యాడ ఎంతో ఉపయోగపడుతుందని, అ పాఠశాలను కూడా ప్రభుత్వపరంగా నడిపించేందుకు కృషి చేస్తున్నామని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

విశాఖ విమల విద్యాలయం, బి సి రోడ్, పెదగంట్యాడ పాఠశాలను కూడా ప్రభుత్వపరంగా నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులతో కలిసి, విశాఖ జిల్లా కలెక్టర్ శ్రీ అభిషక్త్ కిషోర్ ని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని

మొల్లి పెంటిరాజు విశాఖ జిల్లా తెలుగుయువత ప్రధానకార్యదర్శి, డైరెక్టర్ - ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ తెలిపారు 40 ఏళ్లుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఆధ్వర్యంలో నడుస్తున్న విశాఖ విమల విద్యాలయం, బి సి రోడ్, పెదగంట్యాడ పాఠశాలను కూడా స్టీల్ యాజమాన్యం వచ్చే ఏడాది నుంచి నిలిపివేయాలని నిర్ణయం తీసుకోవడంతో, పాఠశాల ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు గతంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుని సంప్రదించడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విశాఖ విమల విద్యాలయం ఉక్కునగరం పాఠశాలను, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఎంపీ భరత్ సహకారంతో, ఏ విధంగా ప్రభుత్వ పాఠశాలగా నడిపించేందుకు చర్యలు తీసుకున్నారో, అదేవిధంగా విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూమిలిచ్చిన, నిర్వాసిత ప్రజల కోసం, కాంట్రాక్ట్ కార్మికుల పిల్లల కోసం, ప్రధాన నిర్వాసిత కాలనీలైన ప్రాంతానికి చెందిన విశాఖ విమల విద్యాలయం - పెదగంట్యాడ పాఠశాలను కూడా ప్రభుత్వపరంగా నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని, పెద్ద ఎత్తున నిర్వాసితు ప్రజలు కోరడంతో, విశాఖ విమల విద్యాలయం ఉక్కునగరం పాఠశాలను ప్రభుత్వం పరంగా నడుస్తుందని తెలిసిన వెంటనే, కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని, రాష్ట్ర విద్యా శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ దృష్టి కూడా ఈ సమస్యను తీసుకువెళ్తామని తెలిపారు.

కూటమి ప్రభుత్వం తప్పకుండా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకొని నడుస్తుందని , ప్రజాభిప్రాయంకు మేరకే నడుచుకుంటామని అన్నారు.

విశాఖ జిల్లా కలెక్టర్ అభిషక్త్ కిశోర్ వినతిపత్రం తీసుకుని తప్పకుండా ప్రభుత్వ పరంగా సంబంధిత అధికారులు, నాయకులు దృష్టి కి తీసుకొనేవెళ్ళి, సమస్యను పరిష్కరిస్తామని తెలిపారన్నారు.

ఉపాధ్యాయులు సూర్య ప్రతాప్, మధు నాయుడు, లత, సుగుణామని, పూర్వ విద్యార్థులు రజిని, కోన రమణ, శ్రీను, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎం మాకవరం, ఆడాకుల,చీడి పాలెం లో “రైతన్న మీకోసం”




మండల వ్యవసాయ అధికారి “ శివరామ ప్రసాద్ “

**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 22:**భూ పరీక్షలు ఆధారంగా సమతూల్య ఎరువులు వినియోగం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడును సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి శివరామ ప్రసాద్ తెలిపారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలో ఆడాకుల, ఎం మాకవరం, చీడిపాలెం రైతు సేవా కేంద్రాల్లో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏవో శివరామ ప్రసాద్ మాట్లాడుతూ...వర్షపాతం లోపం లేదా వాతావరణ మార్పులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. రైతులు నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ప్రత్యామ్నాయ పంటలు కార్యచరణ రూపొందించుకున్నప్పుడే అధిక దిగుబడును సాధించవచ్చు అని తెలిపారు. ప్రభుత్వం అందించే ఎరువులు ఆన్లైన్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వము ప్రత్యామ్నాయ పంటలు, లాభదాయక పంటలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందని వివరించారు ముఖ్యంగా మార్కెట్లో ఏ పంటకు . అవకాశాలు ఉన్నాయో వాటిని ఎంపిక చేసి సాగు చేయాలని రైతులను కోరారు. వ్యవసాయ రైతులను ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వ్యవసాయ రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఆయా రైతు సేవా కేంద్రాల్లో గల గ్రామాల రైతుకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం




**.మాడుగుల. పెన్ పవర్ జూన్ (22)** కోరపల్లి పంచాయతీ కిటుముల గ్రామం లో "రైతన్న మీకోసం" కార్యక్రమంలో భాగంగా ఈరోజు రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈడీ ౦.బాబురావు నాయుడు రిటర్డ్ కలెక్టర్ ఐఏఎస్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితుల ప్రభావం చాలా విషపూరితమైన కాలుష్యం లో మనం జీవిస్తున్నాము అయితే వీటి గల కారణం ఈ మధ్యకాలంలో రైతులు దిగుబడి కోసం ఆశపడి విషపూరితమైన రసాయన ఎరువులు పురుగుమందులు వాడటం అదే పంటలను తినడం వలన అనేక రోగాల బారిన పడుతున్నాం. అందుకుగాను కేంద్రా రాష్ట్ర ప్రభుత్వాలు గత పది సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయ ప్రతి రైతు చేయాలని. రైతు సాధికారిక సంస్థ ద్వారా పంచాయతీలో గల మహిళా సంఘాలకు ప్రకృతి వ్యవసాయం పట్ల స్థానిక ఖాలలో సీఆర్పీలు. ఐసిఆర్పిల చేత రైతులకు అవగాహన శిక్షణ కార్యక్రమాలు చేయిస్తూ ఏక పంట కాకుండా బహుళపంట విధానం చేయాలని అలాగే మనకున్న ప్రకృతి సాహసిద్ధంగా దొరికే ఆవు పేడ ఆవు మూత్రంతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని ఏమైనా చీడపీడ పురుగులు వస్తే ప్రకృతిలో దొరికే చేదు ఆకులతో కషాయాలు తయారు చేసుకుని ప్రకృతి వ్యవసాయం చేసుకోవాలని ముఖ్యంగా ఈ యొక్క ఖరీఫ్ సీజన్ జూన్ 2026 నుండి జూన్ 2027 వరకు ఎల్ నినో ప్రభావం చాలా తీవ్రతగా ఉంటుందని ఈ ప్రభావం వలన వస్తే భారీగా వర్షం పడిపోవడం తర్వాత విపరీతమైన ఎండలు వాటి వలన పంట నష్టం జరిగి రైతులకు కరువు వచ్చే ప్రమాదం ఉంటుందని ఈ యొక్క వాతావరణ పరిస్థితిని అధిగమించుటకు రైతు మొదటిగా తనకున్న భూమిలో పిఎండిఎస్ నవధాన్యాల సాగు మొదటిగా వేసుకోవాలని ప్రధాన పంటలు కనీసం ఐదు రకాల దీర్ఘకాలిక పంటలను విత్తనా గుళికలుగా తయారు చేసుకుని రైతుకున్న పొలంలో వేసుకోవాలని తెలియజేస్తూ విత్తన శుద్ధికి బీజామృతంతో శుద్ధి చేసి బంక మట్టి పౌడర్ . ఘనజీవం. కర్రలు బూడిద తో విత్తన గుళికలు తయారు చేసుకోవాలని రైతులతో చేయించడం జరిగింది విధానాల గూర్చి అనేక విషయాలు చర్చించారు స్థానిక పాఠశాలలో పిల్లలతో ముచ్చటించి ఎలా చదువు తున్నారో అడిగి తెలుసుకున్నారు అయితే గ్రామంలో పరిమినెంట్ టీచర్ లేదు డిప్యూటేషన్ గా ప్రక్కన కొరపల్లి స్కూల్ నుండి వచ్చి చెపుతున్న విషయం గ్రామస్తులు చెప్పారు. ఈ విషయం పై అధికారులకు తెలిజెస్తానని అన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ ఈడి బాబురావు నాయుడు ( రిటర్డ్ కలెక్టర్ ఐఏఎస్) స్థానిక రైతులు. రైతు సాధికారిక సంస్థ యూనిట్ ఇన్చార్జి మేడ ప్రసాద్ రైతు సాధికారిక సంస్థ కాపీ జీజూ రవీంద్ర.మండల మీ సింహాచలం మండల కాపీ మీ రామలింగం రైతు సాధికార సిబ్బంది ఐ సి ఆర్ పిస్ పాల్గొన్నారు.




## ముంచంగిపుట్టు పిజిఆర్ఎస్ లో 6 అర్జీలు

మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే ధర్మారావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 22.** మండలంలో గల మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో 06 అర్జీలు దాఖలైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే ధర్మారావు తెలిపారు. ఐసిడిఎస్, ఆర్డబ్ల్యూఎస్, రెవిన్యూ శాఖలకు సంబంధించి మొత్తం 06 అర్జీలు అందినట్లు ఎంపీడీవో వెల్లడించారు. కాగా గ్రీవెన్స్ లో శనివారపు సంతలో మౌలిక సదుపాయాల కల్పన కొరకు, రైతుల సాగు భూములో చెక్ డ్యాములు నిర్మాణాల కొరకు వినతి పత్రాలను సమర్పించారు.

## రైతు రుణాలు, బీమా సేవలపై యూనియన్ బ్యాంక్ అవగాహన సదస్సు



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూన్ 22:** మండలంలోని జర్రెల పంచాయతీ పరిధిలోని జర్రెల సచివాలయ ప్రాంగణంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రైతులు, గ్రామస్థులకు బ్యాంకింగ్ సేవలు, రైతు రుణాలు, బీమా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు రుణ మేళాతో పాటు గ్రామంలో కొత్తగా బ్యాంకింగ్ కరస్పాండెంట్ (బీసీ) పాయింట్ ఏర్పాటు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను బ్యాంకు అధికారులు వివరించారు. రైతులు పంటల సాగు కోసం అధిక వడ్డీకి ప్రైవేట్ దళారులను ఆశ్రయించి మోసపోకుండా బ్యాంకులు అందిస్తున్న పంట రుణాలను వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన' కింద కేవలం రూ.20 ప్రీమియంతో ప్రమాద బీమా పొందవచ్చని, ప్రమాదవశాత్తు మరణించినా లేదా శాశ్వత వైకల్యం సంభవించినా రూ.2 లక్షల వరకు బీమా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా, సాధారణ మరణ బీమా పథకాల కింద కూడా తక్కువ ప్రీమియంతో బీమా రక్షణ పొందవచ్చని వివరించారు. పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులు సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్ నంబర్లు వెల్లడించరాదని, సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ కే. గౌతమ్ కుమార్, బ్యాంక్ బీసీ మండిబి మహేష్, జర్రెల ఎంపీటీసీ అడపా లోవలక్ష్మి, మాజీ సర్పంచ్ అడపా విజయకుమారి, పెసా కమిటీ సభ్యులు జర్త రాజారావు, రీమల గోపాలరావు, వ్యవసాయ సహాయకుడు ఎస్. మాధవ్, వెటర్నరీ అసిస్టెంట్ అడపా విష్ణుమూర్తి, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గొందిమెలక రైతులకు శిక్షణ కార్యక్రమం



**జి.మాడుగుల. పెన్ పవర్.జూన్ (22)** కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకం కింద వేరుశెనగ గొలుసు క్లస్టర్ కార్యక్రమంలో భాగంగా గొందిమెలక గ్రామ రైతులకు శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో విత్తన శుద్ధి ప్రదర్శన రైతులకు జీవ పాలిమర్‌తో విత్తన శుద్ధి ప్రదర్శన క్షేత్రంలోనే చూపించారు. విత్తన శుద్ధి వల్ల తెగుళ్లు, పురుగుల బారి నుండి రక్షణ లభించి, మొలక శాతం పెరిగి దిగుబడి అధికంగా వస్తుందని అధికారులు తెలిపారు.

రైతుల వేరుశెనగ మరియు మొక్కజొన్న పంట పొలాలను వ్యవసాయ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించించారు.

పురుగు దాడిపై ఏరువాక శాస్త్రవేత్త శ్రీ ప్రదీప్ కుమార్ రైతులకు సమగ్ర నివారణ చర్యలు వివరించారు

ఈ కార్యక్రమంలో గొందిమెలక రైతులకు పీఎం డీకేవై ద్వారా ఆముదం విత్తనాలు అందించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇన్చార్జ్ ఎల్ ఆర్ బి పాత్రుడు పాల్గొన్నారు

# తూర్పులో వెలగపూడి జన్మదిన వేడుకలలు

## 13 వ వార్డు కార్యాలయంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ప్రతాపరుద్ర



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూన్ 22:** శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు జన్మదినం సందర్భంగా 13వ వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,శ్రీమహాలక్ష్మి ఆధ్వర్యంలో వార్డు టిడిపి కార్యాలయంలోజరిగిన జన్మదిన వేడుకలకు ముఖ్య అతిధిగా వెలగపూడి ప్రతాపరుద్ర పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ. వార్డు నాయకులు, కార్యకర్తలు,అభిమానులు మధ్య కేక్ కట్ చేసి వెలగపూడి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా స్వీట్లు,పండ్లు, బిస్కెట్లు,ఫ్రూట్ జ్యూస్,పలకలు అంగన్వాడి పిల్లలకు,వార్డు పారిశుధ్య కార్మికులకు,సిబ్బందికి, వృద్ధులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెలగపూడి గారికి నిండు నూరేళ్ల అష్టైశ్వర్యాలను, ఆయురారోగ్యాలను ఆ భగవంతుడు ప్రసాదించాలని, ప్రజల కష్ట సుఖాలలో తోడుంటూ,ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉండి, ప్రజలకు సేవ చేసే భాగ్యం ఆయనకు కలగాలని,రాజకీయంలో ఉన్నత స్థాయి కి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు, మహిళా నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ కార్యకర్త కుటుంబానికి జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర పరామర్శ



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 22.** ముంచంగిపుట్టు మండలం సుజనకోట పంచాయతీ తోటపుట్టు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కుటుంబాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం పరామర్శించారు. ఆ గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త పూజారి నాగేశ్వరరావు సతీమణి పన్నో(28) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో సుభద్ర సోమవారం నాగేశ్వరావు పరామర్శించి ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జె సి ఎస్ కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, సుజనకోట తాజా మాజీ సర్పంచ్ వెంగడ రమేష్, మండల పార్టీ అధ్యక్షులు పాంగి పద్మా రెడ్డి, స్థానిక ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి దామోదరం, వైఎస్ఆర్సిపి పంచాయతీ ఉపాధ్యక్షులు సీసా రాధాకృష్ణ, నాయుడు, డొంబు, నారాయణ పాల్గొన్నారు.

# జూన్ 22 నుంచి 'రైతన్న మీకోసం' కార్యక్రమం





**రైతులకు ఏపీ ఏఐఎంఎస్ యాప్‌పై అవగాహన**

**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, జూన్ 22:** మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల పరిధిలో జూన్ 22 నుంచి 27వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో 'రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి డి. గిరిబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది నుంచి ఎరువుల పంపిణీని ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా చేపట్టనున్నట్లు రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. యాప్ వినియోగ విధానం, ఎరువుల పంపిణీ విధానంపై రైతులకు వివరించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండే అవకాశముందని శాస్త్రవేత్తలు సూచించిన నేపథ్యంలో, అందుకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టాలని రైతులకు సూచించనున్నట్లు తెలిపారు. సోమవారం దారకొండ, గాలికొండ, గుమ్మరేవుల, మొండిగడ్డ, సంకాడ, దామనపల్లి, రింతాడ, జర్రెల గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వ్యవసాయ అధికారి వివరించారు.


## ఆయా ఇంటర్వ్యూకు సమాచారం ఇవ్వలేదంటూ ఆరోపణ

- ఐసీడీఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, జూన్ 22:** మండలంలోని గూడెంకొత్తవీధి ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలో ఇటీవల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైన ఆయా కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ఇంటర్వ్యూకు సంబంధించిన సమాచారం అందించకపోవడంతో హాజరు కాలేకపోయానని దేరాల గ్రామానికి చెందిన లోచలి సంధ్యారాణి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. తాను ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకున్నానని, అవసరమైన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఇంటర్వ్యూకు సంబంధించిన సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇంటర్వ్యూకు హాజరు కాలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు జోగిరాజు మాట్లాడుతూ, తన భార్యకే ఇంటర్వ్యూ సమాచారం అందకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధితురాలికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## పెదవలసలో తహసీల్దార్ ఆదేశాలతో అక్రమ నిర్మాణాల తొలగింపు



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూన్ 22:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం పెదవలస గ్రామంలో చెరువు గర్భంలోని ప్రభుత్వ భూమిపై అక్రమంగా చేపట్టిన నివాస గృహాల నిర్మాణాలను రెవెన్యూ అధికారులు తొలగించారు. గ్రామంలోని చెరువు గర్భంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి గతంలో కొందరు నివాస గృహాలను నిర్మించగా, అధికారులు వాటిని తొలగించారు. అయితే, అదే స్థలంలో మళ్లీ కొందరు గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నట్లు అధికారుల దృష్టికి రావడంతో జీకేవీధి తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలమజ్జి,పెదవలస గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో)సత్యమణి తో పాటు రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వ భూములు, చెరువుల గర్భాలను ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కంకిపాటి మోహన్ గాంధీ, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు కంకిపాటి సాయికిశోర్, గిరిబాబు తదితరులతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అధికారులకు సహకరించారు.

## ఎస్ఐఆర్ అమలుపై రాజకీయ పార్టీలతో సమావేశం





**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, జూన్ 22:**ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం అమలు, విధివిధానాలపై బీఎల్ఏల సహకారం కోసం గూడెంకొత్తవీధి మండల తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.మండల తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు, బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏలు) బాధ్యతలు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై నాయకులకు వివరించారు. ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ బోయిన కుమారి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, ఆదివాసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజుబాబు, ఎంపీటీసీలు పసుపులేటి నాగమణి, అంపురంగి బుజ్జిబాబు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 11 వ వార్డులో వెలగపూడి రామకృష్ణ బాబు జన్మదిన వేడుక

- **400 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ 500 మందికి అన్నదాన కార్యక్రమం**
- **నిర్వహించిన టీడీపీ నాయకులు కాకి గంగరాజు**
- **ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి యువ నాయకులు వెలగపూడి ప్రతాపరుద్ర,**



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూన్ 22:** తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు జన్మదినం సందర్భంగా నియోజకవర్గ పరిధిలో పలు వార్డులలో నిర్వహించిన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా టిడిపి యువ నాయకులు ప్రతాపరుద్ర పాల్గొన్నారు.11వ వార్డు టీడీపీ నాయకులు కాకి గంగరాజు ఆధ్వర్యంలో గాంధీనగర్ స్కూల్ వద్ద స్కూల్ విద్యార్థులు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అందరు సమక్షంలో యువ నాయకులు వెలగపూడి ప్రతాప్ రుద్ర.చేతులతో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు, అనంతరం ఓం సాయిరాం కేటరింగ్ అధినేత, వి జ్యువలరీ మార్ట్ అధినేత కాకి గంగరాజు సొంత నిధులతో గాంధీనగర్ అంబేద్కర్ నగర్ గవర్నమెంట్ స్కూల్ లో ఉన్న 400 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు, శివాలయంలో ఎమ్మెల్యే గారు పేరుమీద ప్రత్యేక పూజలు నిర్వహించి 500 మందికి అన్నదానం చేశారు, ఈ కార్యక్రమంలో ఎం. కృష్ణంరాజు. అప్పారావు,బర్రి సూర్యనారాయణ, సత్యనారాయణ,ఎస్.కె, కలిశా,నాయుడు, సిహెచ్. ఆదినారాయణ రాజు,బోయి శ్రీను, కడుపుట్ల చిన్నారావు, రంగాల మంగరాజు, పచ్చిపాల శ్రీను, కొల్లి ఎర్రాజీరావు, పద్మజాను, సబవరపు అప్పలనాయుడు, పిట్ట దేవుడు,లింగబోతు అప్పారావు, ప్రకాష్ నాయుడు, లొడగల రమణ, వెంకటేశ్వరరావు, మహిళ నాయకురాలు రేఖా జ్యోతి, రావాడ జయ, మజ్జి లక్ష్మి, చందక లలిత, కోడూరి జ్యోతిర్మయి, సీత, చిన్నములు, తదితరులు పాల్గొన్నారు,ం

## కాపులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- **ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు**



**కాకినాడ, పెన్ పవర్ జూన్ 22:** ఎన్నికల సమయంలో కూటమి పార్టీల నాయకులు కాపు సామాజిక వర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వైసీపీ పీఏసీ సభ్యుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు డిమాండ్ చేశారు.కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) తనపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం కాకినాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

తనను భూ కబ్జాదారుడిగా,దళితులపై దాడులకు పాల్పడిన వ్యక్తిగా ఎమ్మెల్యే నానాజీ చేసిన ఆరోపణలు నిరాధారమని తోట త్రిమూర్తులు అన్నారు.తాను ఎలాంటి భూ ఆక్రమణలకు పాల్పడలేదని, నిరూపిస్తే సంబంధిత భూమిని నానాజీ పేరున రిజిస్ట్రేషన్ చేయిస్తానని సవాల్ విసిరారు.దళితులకు సంబంధించిన కేసులు కోర్టు పరిధిలో ఉన్నాయని, వాటిని న్యాయపరంగా ఎదుర్కొంటున్నానని చెప్పారు.తన నివాసంలో జరిగిన సమావేశానికి రాజకీయ అనుభవం కలిగిన పలువురు కాపు నాయకులు హాజరయ్యారని, ఆ సమావేశాన్ని అవమానకరంగా వ్యాఖ్యానించడం తగదన్నారు.అవసర మైతే తాను కూడా తీవ్రంగా స్పందించగలనని,అయితే తన ఆత్మగౌరవం అలాంటి వ్యాఖ్యలకు అడ్డుగా నిలుస్తోందని పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యవహారశైలిపై కూడా తోట విమర్శలు గుప్పించారు. జనసేనలోని కాపు ప్రజాప్రతినిధులు కలిసి పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చేయాలని కోరితే తాను కాపు నాయకుడిగా సంతోషిస్తానన్నారు. రాజకీయ పార్టీల్లో సేవల కంటే కుల ప్రాతిపదికనే టికెట్లు కేటాయిస్తున్నారని,కులం కూడా రాజకీయాల్లో ఒక బలమని వ్యాఖ్యానించారు.అలాగే కాపు కార్పొరేషన్‌కు ప్రతి ఏడాది రూ.3 వేల కోట్లు కేటాయిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండేళ్ల పాలన పూర్తయ్యాక ఎమ్మెల్యే నానాజీ రాజీనామా చేస్తే,తాను కాకినాడ రూరల్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధమని తోట త్రిమూర్తులు ప్రకటించారు.

# కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జెడ్పీ చైర్ పర్సన్

- **తోటపుట్టు ప్రజల కల్వర్టు నిర్మాణానికి అభ్యర్థన.**
- **జెడ్పీ నిధులు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసిన జెడ్పీ చైర్ పర్సన్.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 22.**ముంచంగిపుట్టు మండలం సుజనకోట పంచాయతీ, తోటపుట్టు గ్రామం పూర్తిగా పివిటిజీల నివాసం ఉండే తండా. గ్రామానికి ఇప్పటి వరకు సరైన రహదారి సౌకర్యము లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్న వైనం. గ్రామస్తులంతా ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి తీసుకొచ్చారు. దానికంటే ముందు ఆ గ్రామానికి కనీసం వాహనాల రాకపోకలు జరగాలంటే కల్వర్టు నిర్మాణం చేపట్టాలని అప్పుడే అది సాధ్యమవుతుందని ఆమె దృష్టికి తెచ్చారు. వెంటనే ఆమె స్పందించి జిల్లా పరిషత్ నుంచి కల్వర్టు నిర్మాణానికి ఐదు లక్షల మంజూరు చేశారు. దీని నిర్మాణ పనులకు సోమవారం ఆమె కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. సోమ వారం ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ.. తోటపుట్టు అనేది పూర్తిగా పివిటిజీ గ్రామం అని ఆ గ్రామానికి ప్రభుత్వం గృహాలు మంజూరు చేసిందని కానీ ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ తీసుకెళ్లేందుకు సరిగ్గా రోడ్డు లేదన్నారు. రోడ్డు లేక ఇప్పటి వరకు ఆ గ్రామంలో ఒక ఇంటి నిర్మాణం కూడా జరగలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్తులు ఉన్న రోడ్డు పైనా మెటీరియల్ తీసుకెళ్లేందుకు సహకారం అందించాలని కోరునట్లు తెలిపారు. అందులో భాగంగా ఓ కల్వర్టు నిర్మాణం జరిగితే తమ గ్రామానికి మెటీరియల్ వస్తుందని తన దృష్టికి తీసుకు రావడంతో వెంటనే జిల్లా పరిషత్తు నుంచి ఐదు లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నేడు ఈ కల్వర్టు నిర్మాణానికి గ్రామస్తులతో కలిసి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు.

**వెంటనే రోడ్డు నిర్మించండి .**

గ్రామంలో సుమారు 80 నుంచి 100 కుటుంబాల నివాసం ఉన్నాయని ఇప్పటివరకు రోడ్డు లేకపోవడందురదృష్టకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ గ్రామానికి రహదారి నిర్మాణానికి కృషి చేయాలని సుభద్ర అభ్యర్థించారు. రహదారి లేక ప్రజల పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలని ఆమె అన్నారు. కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన తర్వాత పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అతిద్య వర్మ ను కలిసిన సుభద్ర ఆ గ్రామానికి రహదారి మంజూరు చేయాలని పాడేరు ఐటిడిఏ పీవో ఆదిత్య వర్మ కు సుభద్ర కోరారు. కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం పాడేరులో పిఓ ను కలిసి సమస్యను వివరించారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. కల్వర్టు నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు మంజూరు చేసిన జిల్లా చైర్పర్సన్ సుభద్ర కు తోట కొట్టు గ్రామస్తులందరూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జెసి ఎస్ కోఆర్డినేటర్ అరబీరు జగబంధు సుజన కోట తాజా మాజీ సర్పంచ్ వెంగడ రమేష్ మండల పార్టీ అధ్యక్షులు పాంగి పద్మా రావు స్థానిక ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి దామోదరం వైఎస్ఆర్పిపి పంచాయతీ ఉపాధ్యక్షులు సీసా రాధాకృష్ణ సాక్షి సురేష్ నాయుడు, డొంబు, నారాయణ గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆంధ్ర మెడికల్ కాలేజీని సందర్శించిన ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడు



### ఏఐ ఆధారిత మాతా,శిశు సంరక్షణ సేవలపై ప్రశంసించిన: జోహేన్నేన్స్ జూట్

**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూన్ 22:** విశాఖ కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్), ఆంధ్ర మెడికల్ కాలేజీని ప్రపంచ బ్యాంక్ దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు జోహన్నెస్ జుట్ సోమవారం సందర్శించారు. ఈ పర్యటనలో రాష్ట్ర సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు.పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కె. పద్మావతి, ప్రపంచ బ్యాంక్ హెల్త్ టీమ్ ప్రతినిధి అమిత్ నాగరాజ్, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ గొబ్బిళ్ళ విద్యాధరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు,కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి. రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్, డా. డి. రాధకృష్ణన్,డి. సీఎస్ ఆర్ ఎం. డా. కుమార్, డి. సి. హెచ్ ఎస్ .డా. నరేంద్ర సింగ్, అడ్మినిస్ట్రేటర్ డా. బి. కిరణ్ కుమార్ ఇతర జిల్లా అధికారులు,మంత్రిత్వ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎమ్. సంధ్యా దేవి అతిథులకు స్వాగతం పలికి, ఆంధ్ర మెడికల్ కాలేజీ, కేజీహెచ్ శతాబ్ద కాల చరిత్ర, వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధన రంగాల్లో సాధించిన విజయాలు, ఆధునిక వైద్య రంగంలో తీసుకొచ్చిన వినూత్న ఆవిష్కరణలను వివరించారు.

అనంతరం పీడియాట్రిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి, గైనకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఉషా ప్రసాద్ గారు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) ఆధారంగా గర్భిణీ స్త్రీలలో ప్రసవానికి ముందు శిశువుల ఆరోగ్య పరిస్థితి, గుండె వేగాన్ని డిజిటల్ ఫీటల్ మానిటరింగ్ ద్వారా ఎలా పర్యవేక్షిస్తున్నారో ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సాంకేతికత ద్వారా పుట్టబోయే బిడ్డకు ప్రమాద సూచనలు ఉంటే ముందుగానే గుర్తించి తక్షణ చికిత్స అందించడం ద్వారా శిశువును సురక్షితంగా కాపాడవచ్చని తెలిపారు. అంతేకాకుండా, ఈ పరికరాలను నిపుణులైన వైద్యులు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే, అక్కడ పనిచేస్తున్న ఏఎన్ఎంలు, నర్సింగ్ సిబ్బంది లేదా ఇతర ఆరోగ్య సిబ్బంది పరీక్షల వివరాలను వెంటనే నిపుణులకు పంపించి వారి సూచనల మేరకు అత్యవసర వైద్య సహాయం అందించవచ్చని వివరించారు. దీనివల్ల శిశు మరణాల రేటు తో పాటు మాతృ మరణాల రేటు ను కూడా గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.

ఈ అంశంపై నిర్వహించిన పరిశోధనకు ఇటీవల మెడ్‌టెక్ ఇన్నోవేషన్ విభాగంలో ప్రత్యేక ప్రశంసలు లభించాయని, ఆ వివరాలను కూడా ప్రపంచ బ్యాంక్ బృందానికి వివరించారు. ఈ వినూత్న కార్యక్రమాల గురించి తెలుసుకున్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు బృందం కేజీహెచ్ వైద్యులు చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు.

తదుపరి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ప్రసూతి మరియు గైనకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సౌమిని, ప్రొఫెసర్ డాక్టర్ శైలజ గార్లు కలిసి గర్భాశయ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించే సరికొత్త ఏఐ దయాగ్నోస్టిక్స్ సాంకేతికతపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సాంకేతికత పనితీరును చూసి ప్రపంచ బ్యాంక్ బృందం ఎంతో ఆసక్తి కనబరిచి, ఈ వినూత్న ప్రయత్నాన్ని ప్రత్యేకంగా అభినందించింది.

ప్రజెంటేషన్ల అనంతరం అధికారుల బృందం నేరుగా గైనకాలజీ విభాగంలోని లేబర్ రూమ్ కాంప్లెక్స్, మెటర్నల్ ఐసీయూను సందర్శించింది. అక్కడ ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఏఐ ఆధారిత డిజిటల్ ఫీటల్ మానిటరింగ్ వ్యవస్థ, రియల్ టైమ్ అలర్ట్ సిస్టమ్, ఏఐ దయాగ్నోస్టిక్ పరికరాల పనితీరును స్వయంగా పరిశీలించారు. వైద్య సేవల్లో డిజిటల్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సును వినియోగిస్తున్న తీరుపై ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడు శ్రీ జోహన్నెస్ జుట్ తీవ్ర సంతృప్తి వ్యక్తం చేశారు. కేజీహెచ్ మరియు ఆంధ్ర మెడికల్ కాలేజీలో అమలవుతున్న ఈ వినూత్న కార్యక్రమాలు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కేజీహెచ్ పరిపాలనా విభాగాన్ని, ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్న ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎమ్. సంధ్యా దేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ప్రసూతి, గైనకాలజీ, పీడియాట్రిక్స్ విభాగాల వైద్య బృందాలను ప్రత్యేకంగా అభినందించి, వారి సేవలకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కేజీహెచ్, ఆంధ్ర మెడికల్ కాలేజీ అధ్యాపకులు, వైద్యులు, అధికారులు, మంత్రిత్వ శాఖ సిబ్బంది మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం.

- **ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా.**



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూన్ 22:** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు.సోమవారం

ప్రత్తిపాడు మండలం వెంకటనగరం గ్రామంలో స్థానిక తహశీల్దార్, ఎం సూర్యప్రభ ఆధ్వర్యంలో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా పాల్గొని రైతులకు పాస్ పుస్తకాలు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాస్ పుస్తకాలపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ చిత్రాన్ని ముద్రించడం వివాదాస్పదమైందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ నాయకుల చిత్రాలకు బదులుగా ప్రభుత్వ రాజముద్రతో పాస్ పుస్తకాలు జారీ చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేస్తున్నామని తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పినట్లుగానే జగన్ చిత్రాన్ని తొలగించి ప్రభుత్వ రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని పేర్కొన్నారు.రైతుల భూహక్కులను మరింత పారదర్శకంగా,అధికారికంగా గుర్తించేలా ఈ పాస్ పుస్తకాలు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీ,రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు,రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ,ఏలేశ్వరం,రౌతులపూడి రౌతులపూడి ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి,గంటిమల్ల రాజ్యలక్ష్మి,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్,కూటమి నాయకులు జ్యోతుల పెదబాబు,బొదిరెడ్డి గోపి,మూది నారాయణస్వామి,యిటంశెట్టి భాస్కరబాబు,గాబు సుభాష్, అధికారులు,ప్రజాప్రతినిధులు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి దేవస్థానంలో బహుళ ఏకాదశి మాస కళ్యాణోత్సవాలు






**కొత్తపేట, పెన్ పవర్, జూన్ 22:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లిలోని ప్రసిద్ధ శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానంలో ప్రతి నెల బహుళ ఏకాదశి తిథి సందర్భంగా నిర్వహించే మాస కళ్యాణోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని దేవస్థానం అధికారులు పిలుపునిచ్చారు.స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచనల మేరకు గ్రామ పెద్దలు, ట్రస్ట్ బోర్డు పాలకమండలి సభ్యులు, దేవస్థానం అధికారులు ఈ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. నిజ జ్యేష్ఠము, ఆషాఢము, శ్రావణము, భాద్రపదము, ఆశ్వీయుజము, కార్తీకము, మార్గశిరము, పుష్యము, మాఘము, ఫాల్గుణము మాసాలలో బహుళ ఏకాదశి రోజున మాస కళ్యాణోత్సవాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అర్ధాష్టమ శని, సప్తమ శని, అష్టమ శని, ఏలినాటి శని దోష నివారణతో పాటు విద్య, ఉద్యోగం, వివాహం, సంతానం, వ్యాపారం, వ్యవసాయం తదితర మనోరథాల సిద్ధి కోసం ప్రతి నెల సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు దేవస్థానం అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు కళ్యాణం నిర్వహించబడుతుందని తెలిపారు.

భక్తులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కళ్యాణంలో పాల్గొనే అవకాశం ఉందని, పాల్గొనదలచిన వారు తమ పేరు, గోత్రం, సంకల్పం వివరాలను దేవస్థానం కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. పరోక్షంగా పాల్గొనే భక్తులకు కళ్యాణం అనంతరం అక్షింతలు, కుంకుమ, ప్రసాదాన్ని పోస్టు ద్వారా పంపించనున్నట్లు తెలిపారు.కార్యక్రమాన్ని "శ్రీ మందపల్లి శనేశ్వర" యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. మాస కళ్యాణం రుసుము రూ.750గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

త్రేతాయుగం నాటి ప్రసిద్ధ త్రిలింగ శైవక్షేత్రంగా పేరుగాంచిన ఈ దేవస్థానంలో శనిదేవుని చేత ప్రతిష్ఠించబడిన శ్రీ మందేశ్వర స్వామి, శ్రీ బ్రహ్మేశ్వర స్వామి, శ్రీ నాగేశ్వర స్వామి ఆలయాలు ఒకే ప్రాంగణంలో ఉండటం ప్రత్యేకతగా అధికారులు వివరించారు. శనిపీడల నివారణకు ఈ క్షేత్రం అత్యంత ప్రసిద్ధి చెందినదిగా భక్తుల విశ్వాసమని పేర్కొన్నారు.

దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి డి. సురేష్‌బాబు ఆధ్వర్యంలో కార్యక్రమాల నిర్వహణ కొనసాగుతోందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం భక్తులు 9491000721, 9491006567 నంబర్లను సంప్రదించాలని సూచించారు.


గౌతమ్యాః దక్షిణ తీరే సూర్యకుండ సమీపగః !
భక్తాభీష్టప్రదం దేవం నిత్యతైలాభిషేచనం !!

శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం
మందపల్లి, కొత్తపేట మండలం
డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

9 శనివారములు ప్రదక్షిణలు అభిషేకాలు
చేసిన కోరిన కోరికలు నెరవేర్చు స్వామి
మందేశ్వర క్షేత్రవాసం శ్రీమాన్ మందేశ సంజ్ఞకం!
పార్వతీ సహితం దేవం శనిపీడా నివారణం !!

బహుళ ఏకాదశి రోజున మాస కళ్యాణము

అర్ధాష్టమశని, సప్తమశని, అష్టమశని, ఏలినాటిశని, విద్య, ఉద్యోగం, వివాహం, సంతానం, వ్యాపారం, వ్యవసాయం మొదలగువాటి నిమిత్తం దేవస్థానం నందు శ్రీ స్వామి, అమ్మవార్లకు ప్రతీనెల బహుళ ఏకాదశి తిథి రోజున సాయంత్రం 5 గం॥ల నుండి 7 గం॥ల వరకు దేవస్థానం అర్చకులు, వేదపండితులచే జరిపించు మాస కళ్యాణంలో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ పాల్గొనవలసినదిగా కోరి ప్రార్ధన.

కావున మాస కళ్యాణంలో పాల్గొనదలచిన భక్తులు పేరు, గోత్రము, సంకల్పము తదితర వివరములను దేవస్థానం కార్యాలయం నందు నమోదు చేసుకొనవలెను. సదరు మాస కళ్యాణమును భక్తులు Youtube Channel 'Sri Mandapalli Saneswara' దేవస్థానం ద్వారా LIVE లో వీక్షించవచ్చును. మాస కళ్యాణంలో పరోక్షంగా పాల్గొను భక్తులకు కళ్యాణం అనంతరం అక్షింతలు, కుంకుమ, ప్రసాదం పోస్టు ద్వారా పంపబడును.

ఈ సంవత్సరం జరుగు బహుళ ఏకాదశి మాస కళ్యాణముల తేదీలు

| నెం. | తేది | వారం | మాసం | నక్షత్రం |
|---|---|---|---|---|
| 1. | 10-07-26 | శుక్రవారం | నిజ జ్యేష్ఠము | భరణి |
| 2. | 09-08-26 | ఆదివారం | ఆషాఢము | మృగశిర |
| 3. | 07-09-26 | మంగళవారం | శ్రావణము | పునర్వసు |
| 4. | 06-10-26 | సోమవారం | భాద్రపదము | ఆశ్లేష |
| 5. | 05-11-26 | గురువారం | ఆశ్వీయుజము | ఉత్తర |
| 6. | 04-12-26 | శుక్రవారం | కార్తీకము | హస్త |
| 7. | 03-01-27 | ఆదివారం | మార్గశిరము | విశాఖ |
| 8. | 02-02-27 | మంగళవారం | పుష్యము | జ్యేష్ఠ |
| 9. | 03-03-27 | బుధవారం | మాఘము | పూర్వాషాఢ |
| 10. | 02-04-27 | శుక్రవారం | ఫాల్గుణము | శ్రవణం |

మాస కళ్యాణం రుసుము రూ॥ 750/-

Sri Mandeswara Swamy Temple SBI

సంప్రదించవలసిన సెల్ నెంబర్లు : 9491000721, 9491006567

శ్రీ స్వామి వారి సేవలో ...


గౌ॥ శ్రీ పూసపాటి అశోక్ గజపతి రాజు గారు
ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ & చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

డి. సురేష్ బాబు
సహాయ కమీషనరు మరియు కార్యనిర్వాహణాధికారి

త్రిలింగ శైవక్షేత్రం

ఆలయ విశిష్టతలు

1. ఈ క్షేత్రములో ఆలయములు అన్నియూ దేవతా ప్రతిష్టలు
2. దేవతా ప్రతిష్ట చేసిన మూడు శివాలయాలు వరుసగా ఒకే ప్రాంగణములో ఉన్న త్రేతాయుగం నాటి ఏకైక త్రిలింగ శైవ క్షేత్రం
3. మొదటి శివలింగం : సాక్షాత్తు శనిదేవునిచే ప్రతిష్ఠించబడిన శివలింగం కావున మందేశ్వరుని మరియు శనేశ్వరుని గా ప్రసిద్ధి చెందిన ఏకైక శైవక్షేత్రం
4. రెండవ శివలింగం : బ్రహ్మ చేత ప్రతిష్ఠించబడిన శివలింగం బ్రహ్మేశ్వర స్వామి
5. మూడవ శివలింగం : సర్పనాగులలో ఒకడైన కర్కోటకునిచే ప్రతిష్ఠించబడిన సర్పాకారములో ఉన్న స్పటిక శివలింగం నాగేశ్వర స్వామి
6. సప్త మాతృకలచే ప్రతిష్ఠించబడిన అమ్మవారు శ్రీ పార్వతీ దేవి
7. గౌతమ మహర్షిచే ప్రతిష్ఠించబడిన క్షేత్రపాలకుడు శ్రీ వేణుగోపాల స్వామి




## బాలల హక్కు, సంరక్షణపై అవగాహన సదస్సు





**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 22:** జాతీయ కేడెట్ దళం (ఎన్సిసి ) వార్షిక శిక్షణా శిబిరం లో భాగంగా, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డి సి పి యు ) మరియు వన్ స్టాప్ సెంటర్ (ఓ ఎస్ సి ) సంయుక్త ఆధ్వర్యంలో గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో బాలల హక్కులు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు మరియు బాలల సంక్షేమ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పాల్గొన్న ఎన్సిసి విద్యార్థులకు బాలల హక్కులు, బాలలపై జరిగే దుర్వినియోగాల నివారణ, బాల్య వివాహాల నిరోధం, పోక్సో చట్టం జువెనైల్ జస్టిస్ చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలు తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించబడింది.

ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డిసిపిఓ ) శ్రీ సి. హెచ్. వెంకట్రావు విచ్చేసి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. బాలలపై ఎటువంటి హింస, దుర్వినియోగం లేదా నిర్లక్ష్యం జరిగినా వెంటనే సంబంధిత అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే బాల్య వివాహ నిషేధ చట్టం-2006 గురించి వివరించి, బాల్య వివాహాలు బాలల శారీరక, మానసిక, విద్యా మరియు సామాజిక అభివృద్ధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఆయన అన్నారు. అనంతరం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీ బి. శ్రీనివాసరావు ఎన్సిసి క్యాడెట్లకు పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. బాలలపై లైంగిక వేధింపుల నిరోధం, చట్టపరమైన రక్షణలు, ఫిర్యాదు చేసే విధానం వంటి అంశాలను వివరించారు. అలాగే సురక్షితమైన స్పర్శ (గుడ్ టచ్ ) మరియు అసురక్షితమైన స్పర్శ (బ్యాడ్ టచ్) గురించి విద్యార్థులకు వివరించి, ఎటువంటి అనుచిత ప్రవర్తన లేదా వేధింపులు ఎదురైనా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాలలపై జరిగే వివిధ రకాల వేధింపులు మరియు వాటి నివారణ చర్యలపై కూడా అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీవో ) సి. హెచ్. వెంకట్రావు, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ శైలజ, ప్రొటెక్షన్ ఆఫీసర్ జె. విజయ, ఎన్సిసి అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ఎన్సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

# మండలం లో పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ





**గండేపల్లి,పెన్ పవర్ , జూన్ 22:** గండేపల్లి మండలంలో సోమవారం జగ్గంపేట శాసనసభ్యులు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ పలు కుటుంబాలను పరామర్శించారు. ముందుగా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గ్రంధి సుబ్రమణ్యం భార్య మహాలక్ష్మి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, మురారి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గురజాల వెంకన్న దొర తండ్రి కృష్ణ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, అదే గ్రామానికి చెందిన చంద్రాల మల్లేశ్వరరావు అత్తగారి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించే ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, క్లస్టర్ ఇంచార్జి జాస్తి వసంత్, సుంకవిల్లి రాజు, సొసైటీ చైర్మన్ దిడ్డి శ్రీను, కాటేపల్లి భద్రం, గద్దె అబ్బన్న, ఉండవల్లి బుల్లయ్య, చంద్రాల పెద్ద వెంకన్న, జాస్తి రాధాకృష్ణ, కొల్లు త్రిమూర్తులు, తలారి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అవగాహనకే 'రైతన్న మీకోసం' కార్యక్రమం



జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్


**కాజులూరు, పెన్ పవర్,జూన్ 22:** రైతుల సంక్షేమం, వ్యవసాయ ఉత్పాదకత పెంపుదల, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల నిర్వహణ,ఎరువుల వినియోగంలో పారదర్శకత వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'రైతన్న మీకోసం' ఇంటింటి ప్రచార కార్యక్రమం కాజులూరు మండలంలో సోమవారం ప్రారంభమైంది. బంధనపూడి, మతుకుమిల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులతో నేరుగా మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం,సుస్థిర వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బంది ప్రతి రైతు ఇంటికి వెళ్లి ప్రభుత్వ సూచనలు,ఆధునిక సాగు విధానాలు,సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తారని చెప్పారు.ఈ ఏడాది ఎల్-నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, రైతులు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.తక్కువ నీటితో సాగు చేసే పంటలను పరిశీలించడంతో పాటు నీటి సంరక్షణ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల ఎంపికపై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.ఎరువుల పంపిణీలో డిజిటల్ విధానం అమలుతో నిల్వలు,పంపిణీ వివరాలను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం కలుగుతోందని చెప్పారు.రైతులకు అందుబాటులోకి



తీసుకొచ్చిన ప్రత్యేక యాప్ ద్వారా ఎరువుల లభ్యత, కొనుగోలు వివరాలు తెలుసుకోవచ్చని, దీంతో ఎరువుల అక్రమ వినియోగం, మళ్లింపులు, నిల్వల దుర్వినియోగం వంటి సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.నేల పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం చేపడితే అధిక దిగుబడులతో పాటు నేల సారవంతత కూడా మెరుగుపడుతుందని తెలిపారు. అధికంగా లేదా తక్కువగా ఎరువులు వినియోగించడం వల్ల రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుందని, అందుకే శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు.పంటల వైవిధ్యీకరణ ద్వారా వాతావరణ మార్పులు,మార్కెట్ ధరల హెచ్చుతగ్గుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు.'సుస్థిర వ్యవసాయమే లక్ష్యం' అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమం రైతులకు సూచనలు అందించడమే కాకుండా,వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను సూచించే వేదికగా ఉపయోగపడనుందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్ వర్మ, రైతులు,కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ1గా ఉమ్మిడి వెంకటరావు నియామకం.

-నియామక పత్రాన్ని ఎన్నికల అధికారికి అందజేసిన ఉమ్మిడి.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూన్ 22:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావును బూత్ లెవల్ ఏజెంట్-1 (బిఎల్ఏ-1)గా నియమిస్తూ పార్టీ నిర్ణయం తీసుకుంది.ఈ నియామకానికి సంబంధించిన పత్రాన్ని ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన అధికారులు రమేష్ డివి సాయి వర్మకు అధికారికంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు ధర్నాలకోట శీనుతో పాటు నాయకులు దాసరి సత్తిబాబు,దొంతంశెట్టి చంద్రశేఖర్,పెద్దిరెడ్డి వీరబాబు మరియు పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా పారదర్శకతకు పెద్దపీట..

* ర్యాలి గ్రామంలో 59వ బూత్‌లో ఓటర్ వెరిఫికేషన్





**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 22** ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అయిన ఓటరు జాబితాలను పకడ్బందీగా రూపొందించేందుకు డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని 59వ పోలింగ్ బూత్‌లో ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఓటర్ల వివరాల్లో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సంయుక్తంగా ఈ ప్రక్రియను చేపట్టారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ బూత్ ఇన్‌చార్జ్ అత్తిలి చిరంజీవి, వైసీపీ బూత్ ఇన్‌చార్జ్ ముగండ రమేష్, జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పడాల దేవి ప్రసాద్, బీఎల్ఓ అధికారి సాక శిరీష పాల్గొని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటరు జాబితాలో అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను సరిచూసుకుని, పేరు, చిరునామా, వయస్సు తదితర అంశాల్లో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలని అధికారులు సూచించారు. ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా తీర్చిదిద్దేందుకు ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.

## ఏడువారాల వెంకన్న నిత్య అన్నదానానికి రూ.1,00,116 విరాళం

* పడాల రామ వెంకట సత్యనారాయణ రెడ్డి--లక్ష్మి సరోజ దంపతుల ఉదారత.. దాతలకు ఆలయ సత్కారం





**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 22:** ఏడువారాల చందన స్వరూపుడిగా భక్తులకు నిలువెత్తు దర్శనమిస్తున్న శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఏడువారాల వెంకన్నగా విరాజిల్లుతున్న స్వామివారి సన్నిధిలో సోమవారం అష్టోత్తర శతనామార్చన, నిత్య కల్యాణం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పూజల్లో దంపతులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఆలయ సన్నిధిలో నిరంతరం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు విశేషంగా విరాళాలు అందజేస్తున్నారు. రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామానికి చెందిన పడాల రామ వెంకట సత్యనారాయణ రెడ్డి -- లక్ష్మి సరోజ దంపతులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి నిత్య అన్నదాన కార్యక్రమం కోసం రూ. 1,00,116 విరాళంగా సమర్పించారు.

ఆ దంపతులను ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వదించగా, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. భక్తుల సహకారంతో ఆలయ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగుతున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## విద్యా చైతన్యమే లక్ష్యంగా 'గో టూ విలేజ్--40 డేస్'.. వెలిచేరులో ఎంఆర్‌పీఎస్ కార్యక్రమం

### పదో తరగతి ఉత్తీర్ణుల సన్మానం.. జూలై 7 వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపు





**పెన్ పవర్ ఆత్రేయపురం జూన్ 22 :** సామాజిక చైతన్యం, విద్యా వికాసం, యువత భాగస్వామ్యమే లక్ష్యంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) ఆధ్వర్యంలో చేపట్టిన 'గో టూ విలేజ్--40 డేస్' కార్యక్రమం డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామంలో నిర్వహించారు. మే 25 నుంచి జూలై 5 వరకు కొనసాగుతున్న ఈ కార్యక్రమాన్ని పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల తో నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు.

ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, విద్య ద్వారానే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుపై అవగాహన పెంపొందించడం, మధ్యలో చదువు మానేసిన విద్యార్థులను తిరిగి విద్యా సంస్థల్లో చేర్పించే దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. అలాగే యువత, చదువుకున్న మేధావులు, విద్యావంతులు ఎంఆర్‌పీఎస్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామ, మండల స్థాయిలో ఇంకా పూర్తికాని కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

జూలై 7న ఎంఆర్‌పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవంతో పాటు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ప్రతి గ్రామంలో పండుగ వాతావరణంలో నిర్వహించాలని, జెండా దిమ్మెలు ఏర్పాటు చేసి జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, గ్రామ యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ఉద్యమ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ స్థాయిలో విద్య, సామాజిక చైతన్యం, ఉద్యమ స్ఫూర్తిని పెంపొందించే దిశగా 'గో టూ విలేజ్--40 డేస్' కార్యక్రమం ముందుకు సాగుతుందని నాయకులు తెలిపారు.

## కౌశిక్ నదిలో అక్రమ నిర్మాణాలు తొలగించి పవిత్రతను పరిరక్షించాలి

**- కొత్తపేట ఆర్డీఓ కు సామాజిక పౌరుడు కూడిపూడి విష్ణుమూర్తి వినతి**







**అమలాపురం స్టాఫ్ రిపోర్టర్/ఆత్రేయపురం, పెన్ పవర్ జూన్ 22:** గత కొద్ది సంవత్సరాలుగా కొత్తపేట మండల పరిధిలోని పవిత్రమైన కౌశిక్ నదిని ఆక్రమిస్తూ పలివెల వంతెన నుంచి బోడి పాలెం వంతెన వరకు ఇరువైపులా సుమారు 250 అక్రమ నిర్మాణాలు వెలసినట్లు సామాజిక పౌరుడు కూడిపూడి విష్ణుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్మాణాల్లో కొనసాగుతున్న వ్యాపార కార్యకలాపాల ద్వారా ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను నదిలోకి విడుదల చేయడం వల్ల నది జలాలు తీవ్రంగా కలుషితమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నది కాలుష్యం కారణంగా నదీ జలాలపై ఆధారపడిన వ్యవసాయ భూములకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. అలాగే కలుషిత నీటి ప్రభావంతో పరిసర ప్రాంతాల ప్రజలు వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ సమతుల్యతకు, జీవ వైవిధ్యానికి, ప్రజారోగ్యానికి కౌశిక్ నది ఎంతో కీలకమైందని, దాని పవిత్రతను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యతగా భావించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పలివెల వంతెన నుంచి బోడి పాలెం వంతెన వరకు నదీ పరివాహక ప్రాంతంలో ఏర్పడిన అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించడంతో పాటు, నదిలో వ్యర్థాలను వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక పౌరుడు కూడిపూడి విష్ణుమూర్తి కొత్తపేట ఆర్డీఓ జి. వి. వి. సత్యనారాయణకు సోమవారం వినతిపత్రం సమర్పించి, కౌశిక్ నది పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, వ్యవసాయ రంగ ప్రయోజనాల దృష్ట్యా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి, ఆక్రమణలకు అడ్డుకట్ట వేయడంతో పాటు కౌశిక్ నదిని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో పవిత్రమైన కౌశిక్ నది పూర్వ వైభవాన్ని సంతరించుకోవడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన సహజ వనరును అందించగలమని ఆయన అభిప్రాయపడ్డారు.

## శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు

### తల్లిదండ్రుల కలలను నిజం చేయడమే వారికి ఇచ్చే గొప్ప బహుమతి




**పెన్ పవర్ రావులపాలెం జూన్ 22:** ఫాదర్స్ డే సందర్భంగా రావులపాలెంలోని శ్రీ చైతన్య స్కూల్లో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోనసీమ రీజినల్ ఇన్‌చార్జ్ నరేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, తల్లిదండ్రుల పట్ల గౌరవభావం కలిగి క్రమశిక్షణతో చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవడమే వారికి విద్యార్థులు అందించే విలువైన బహుమతి అని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ జగదీష్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు, గురువులు, దైవం సమానమని, పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేసి కష్టపడతారని అన్నారు. వారి కలలను నిజం చేసి సమాజంలో మంచి పేరు తీసుకువచ్చే స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం వివిధ ఆటల పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా, కోలాహలంగా సాగింది. ఈ కార్యక్రమంలో డీన్ సతీష్, సీ-ఇన్‌చార్జ్ మూర్తి, ప్రైమరీ ఇన్‌చార్జ్ కుమారి, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ లలిత తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అన్నవరం సంస్కృత ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉచిత పుస్తకాల పంపిణీ



**అన్నవరం పెన్ పవర్ జూన్ 22:** కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం సంస్కృత ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర' పథకం కింద మంజూరు చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు (టెక్స్ట్ బుక్స్), నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కూటమి నాయకులు ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులకు ఈ పుస్తకాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో అన్నవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు, శంఖవరం మాజీ వైస్ ఎంపీపీ బొమ్మిడి సత్తిబాబు, జనసేన పార్టీ నాయకుడు సత్యాంధ్ర, విద్యా కమిటీ చైర్మన్ సానపల్లి దేవి పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు.

**విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ ధ్యేయం: కూటమి నాయకులు**

ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉచితంగా అనేక విద్యా సదుపాయాలను కల్పిస్తోందని కొనియాడారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ఈ సువర్ణావకాశాలను సద్వినియోగం చేసుకొని, క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తద్వారా తమ తల్లిదండ్రులకు, గ్రామానికి, అలాగే రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ విద్యా కానుక పంపిణీ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు రాజ్, పర్వత వీరేష్, బుచ్చిబాబు, గోవింద్, మనీష్, దేవి మేడం, ధరణి, సత్య మేడం, రికార్డు అసిస్టెంట్ పసుపులేటి చిన్న సుబ్బారావు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com